WWW.SAKSHYAM.COM

సత్యం, సమర్థత, విశ్వసనీయత

# సాక్ష్యం


తెలుగు దినపత్రిక

Telangana

హైదరాబాద్
సోమవారం 14 జూలై 2025

సంపుటి: 16 | సంచిక: 196
పేజీలు: 08 | వెల: రూ.2:00


Published from Hyderabad, Karim nagar & Nalgonda, Vijayawada.



## నేడు వ్యోమగాములు భూమికి తిరుగు పయనం

యాక్సియం-4 మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా, మరో ముగ్గురు వ్యోమగాములు ఈనెల 14న భూమికి తిరుగు పయనం కానున్నారు. ఈ నెల 15న కాలిఫోర్నియా తీరంలో వ్యోమగాముల క్రూ డ్రాగన్ స్పేస్ క్రాఫ్ట్ ల్యాండ్ కానుంది. వెంటనే వ్యోమగాములను ఏడు రోజుల పాటు క్వారంటైన్‌కు తరలించనున్నట్లు నాసా

మిగతా 2 లో..



## భారత్‌లో మరో 'బ్రహ్మోస్' పరీక్షా కేంద్రం

లఖ్‌నవూలో కొత్తగా ఏర్పాటైన బ్రహ్మోస్ ఏరోస్పేస్ పరీక్షా కేంద్రంతో రక్షణ రంగంలో భారత్ ఆత్మ నిర్భరత మరింత బలోపేతం అవుతుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. దాని వల్ల ఎంతో మందికి ఉపాధి

మిగతా 2 లో..

## విలక్షణ నటుడు కోటా శ్రీనివాసరావు కన్నుమూత



### ప్రేక్షకుల హృదయాల్లో చెదరని

# 'కోట'

సినీ పరిశ్రమలో మరో విషాదం..

750 కు పైగా చిత్రాల్లో నటించిన కోటా

గత నాలుగు దశాబ్దాల సినీ ప్రయాణం

రాజకీయాల్లోనూ కోటా చెరగని ముద్ర..

కోటా శ్రీనివాస్ మృతికి సంతాపం

తెలుగు చలన చిత్ర పరిశ్రమలో మరో విషాదం నెలకొంది. ప్రముఖ సీనియర్ నటుడు కోటా శ్రీనివాసరావు (83) ఆదివారం తెల్లవారుజామున కన్నుమూశారు. గత కొన్నిరోజులుగా తీవ్ర అస్వస్థతతో భాధపడుతున్న ఆయన ఫిల్మ్ నగర్లోని తన స్వగృహంలో మరణించారు. వయసు మీద పడటంతో నడవలేని స్థితిలో ఉన్నా రెండేళ్ళ క్రితం వరకూ సినిమాల్లో నటించారు. ఆయనా చివరి సినిమా 2023లో రిలీజైన 'సువర్ణ సుందరి'.గత నాలుగు దశాబ్దాల సినీ ప్రయాణంలో ఎన్నో విలక్షణ పాత్రలను

మిగతా 2 లో..



## వింబుల్డన్ 2025 విజేత జానిక్ సినెర్

### ఫైనల్లో జానిక్ అల్కరాజ్ చిత్తు

### వింబుల్డన్ 2025 గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ

ప్రతిష్టాత్మక వింబుల్డన్ 2025 గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో వరల్డ్ నెంబర్ వన్, ఇటలీ స్టార్ జానిక్ సినెర్ విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో టాప్ సీడ్ జానిక్ సినెర్ 4-6, 6-4, 6-4, 6-4 తేడాతో వరల్డ్ నెంబర్ 2, కార్లోస్ అల్కరాజ్(స్పెయిన్)ను ఓడించాడు. ఈ గెలుపుతో 148 ఏళ్ల వింబుల్డన్ చరిత్రలో టైటిల్ గెలిచిన తొలి ఇటాలీయన్ ప్లేయర్‌గా 22 ఏళ్ల సినెర్ చరిత్రకెక్కాడు. అంతేకాకుండా గత నెలలో జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో అల్కరాజ్ చేతిలో ఎదురైన పరాజయానికి సినెర్ ప్రతీకారం తీర్చుకున్నాడు. ఈ ఓటమితో హ్యాట్రిక్ వింబుల్డన్ టైటిల్ గెలవాలనే అల్కరాజ్ కల చెదిరింది. మూడు గంటల 4 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో జానిక్ సినెర్ పూర్తి ఆధిపత్యం చెలాయించాడు. ఈ మ్యాచ్‌లో అల్కరాజ్ తొలి సెట్‌ను 6-4తో గెలిచి శుభారంభం చేసినా.. ఆ తర్వాత వరుసగా మూడు సెట్లను కోల్పోయాడు. తొలి సెట్ ఓడిన జానిక్ సినెర్ అద్భుతంగా పుంజుకొని వరుసగా మూడు సెట్లను 6-4తో కైవసం చేసుకొని కెరీర్‌లో లోటుగా ఉన్న వింబుల్డన్ టైటిల్ అందుకున్నాడు.

### అంగరంగ వైభవంగా సికింద్రాబాద్

## బోనాల ఉత్సవాలు

### పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి

సికింద్రాబాద్ బోనాల జాతర అట్టహాసంగా జరుగుతోంది. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఈ సందర్భంగా ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని సీఎం రేవంత్ రెడ్డి దర్శించుకున్నారు. ముఖ్యమంత్రికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి రేవంత్ పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మవారిని

మిగతా 2 లో..



## లండన్‌లో మరో ఘోర విమాన ప్రమాదం

- సౌత్ ఎండ్ విమానాశ్రయంలో ఘటన
- టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ప్రమాదం
- ప్రాణనష్టంపై ఇంకారాని స్పష్టత



అహ్మదాబాద్ విమాన ప్రమాద దుర్ఘటన మరవక ముందే.. మరో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదం లండన్‌లో చోటు చేసుకుంది. లండన్‌లోని సౌత్‌ఎండ్ ఎయిర్‌పోర్ట్‌లో విమానం కుప్పకూలింది. ఎయిర్‌పోర్ట్ నుంచి టేకాఫ్ అయిన కాసేపటికే బీ200 అనే విమానం కూలిపోయింది. విమానం కూలిన వెంటనే పెద్ద ఎత్తున పేలుడు, మంటలు సంభవించాయి. ఈ ప్రమాదంలో ఎంతమంది ప్రాణాలు కోల్పోయారో, ఎన్ని మంది గాయపడ్డారో ఇంకా తెలియరాలేదు. ఈ ప్రమాదానికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.



## ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు..

- నిరసనగా జాగృతి నాయకులు ఆగ్రహం
- తీన్మార్ మల్లన్న కార్యాలయంపై దాడి
- గాల్లోకి కాల్పులు జరిపిన గన్‌మెన్

ఎమ్మెల్సీ చింతపండు నవీన్ కుమార్ (తీన్మార్ మల్లన్న) కార్యాలయంపై దాడి జరిగింది. జాగృతి కార్యకర్తలు మేడిపల్లిలోని తీన్మార్ మల్లన్న కార్యాలయంపై శనివారం దాడి చేశారు. బీఆర్‌ఎస్ నేత, ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జాగృతి నాయకులు దాడి చేశారు. ఈ క్రమంలో మల్లన్న గన్‌మెన్ గాల్లోకి 5 రౌండ్లు కాల్పులు జరిపారు.. జాగృతి కార్యకర్తల దాడిలో మల్లన్న ఆఫీసులో ఫర్నిచర్ ధ్వంసం అయింది. మాజీ కార్పొరేటర్ల ఆధ్వర్యంలో దాడి జరిగినట్లు పేర్కొంటున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను బయటకు పంపిస్తున్నారు. అయితే.. జాగృతి నేతల దాడి సమయంలో మల్లన్న ఆఫీస్ లోనే ఉన్నారు.కాగా.. శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో మల్లన్న కవితపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు.. బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌తో కవితకు ఏం సంబంధం..? మీకు మాకు ఏమైనా కంచం పొత్తా అంటూ మల్లన్న వ్యాఖ్యానించారు. మేం రిజర్వేషన్లు అమలు చేస్తుంటే.. మీరు పండగచేసుకోవడం ఏంటో అర్థం

మిగతా 2 లో..

## ప్రజల కోసమే ప్రతి రూపాయి ఖర్చు..

విద్య, వైద్య రంగాల అభివృద్ధికి పెద్దపీట

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



రాష్ట్రంలోని ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి– జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ – ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, మంచిర్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, జి.సి.సి. చైర్మన్ కొట్నాక తిరుపతి, కనీస వేతన బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ

మిగతా 2 లో..

### నేడు కొత్త రేషన్ కార్డుల

# పంపిణీ



### రాష్ట్రంలో 95.56 లక్షలకు చేరిన రేషన్ కార్డులు

### 3.09 కోట్ల మంది లబ్ధిదారులు

### తిరుమలగిరిలో పంపిణీ చేయనున్న సీఎం

ఎన్నో ఎళ్ల ఎదురు చూపులు తీరినట్లే. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హులైన ప్రతి ఒక్కరికీ తెల్ల రేషన్ కార్డ్ ఇస్తామని చెప్పిన విషయం అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో గత కొన్ని నెలలుగా రేషన్ కార్డులను అర్హులైన పేదలకు అందిస్తుంది. అయితే ఈ రేషన్ కార్డు ప్రక్రియ ఈ నెలతో గడువు ముగుస్తుందని ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై స్పందించడం మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. శుక్రవారం తిరుమలగిరి నందు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నూతన రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నారు. 5 లక్షల కార్డులు నూతనంగా ఇవ్వబోతున్నామని, అదనంగా కుటుంబ సభ్యులను రేషన్ కార్డులలో చేర్చుతున్నామని తెలిపారు. దీంతో తెలంగాణలో రేషన్ కార్డుల సంఖ్య 94.72 లక్షలకు చేరనుందని అన్నారు. 13000 కోట్ల రూపాయల ద్వారా 3.10 కోట్ల మందికి 6 కేజీల సన్నబియ్యం ఉచితంగా ఇచ్చి 95 లక్షల కుటుంబాలకు చెందిన పేదవారికి కడుపు నిండా అన్నం పెట్టి ఆకలి తీర్చడం, అర్హులందరికీ

మిగతా 2 లో..

# సంపాదకీయం

## సమిష్టిగా సమస్యలను పంచుకోవాలి

ఇరు రాష్ట్రాల మధ్య నదీజలాల విషయంలో స్పష్టమైన అవగాహనకు రావాల్సి ఉంది. నదీజలాలు ఏటా సముద్రంలో కలుస్తున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకునేందుకు ఉమ్మడిగా ప్రాజెక్టుకులను నిర్మించుకోవడం, నిర్వహించుకోవడం అవసరం.అలాగే వాన నీటిని ఒడిసి పట్టుకోవడంలో ఇరు ప్రభుత్వాలు శ్రద్ద చూపాలి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు వాననీటిని వృధాగా పోకుండా ఉమ్మడిగా ప్రణాళికలు సిద్దంచేయాలి. ఇటీవల కృష్ణా,గోదవారి బోర్డుల్లో పరస్పర ఫిర్యాదులతో నీటి పంచాయితీలను కొనసాగించారు. తాజాగా బనకచర్ల పేరుతో పంచాయితీ మొదలయ్యింది. ఇలా ఎవరిక వారు కాకుండా, కలసి నదీజలాల సద్వినియోగంపై ఇరు రాష్ట్రాలు చర్చించాలి. ఉమ్మడి ప్రయోజనాలు ఆశించాలి. పరస్పర నిందలతో లాభం లేదని గుర్తించాలి కృష్ణ, గోదావరిల నుంచిచుక్కనీరు సముద్రంలో కలవకుండా చూసుకోవాలి. అంతేత్ప రాజకీయప్రయోజనాల కోసం పరస్పరం దుమ్మెత్తి పోసుకోవడం తగదు. ఇది వాంఛనీయం కూడా కాదు. ఇటీవల మరోమారు తెలుగు రాష్ట్రాల సిఎంలు కూర్చుని విభజన సమస్యలను ప్రస్తావించారు. పరస్పర అవగాహనతో ముందుకు పోతామని ప్రకటించారు. అదే సందర్భంలో జలవనరుల విసయంలో పరస్పర అవగాహన అవసరం. సున్నితమైన సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సుహృద్భావం ఉండాలే తప్ప రెచ్చగొట్టే విధానాలు సరికాదు. విపక్షాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే పరిస్థితి రాకుండా చూడాలి. ఉభయ ప్రభుత్వాలు వీలున్నంత త్వరగా సామరస్యంగా జల వివాదాలను పరిష్కరించుకుని ఇటు రాయలసీమ అటు తెలంగాణలోని కరువు ప్రాంతాలకు నీటిని తరలించే ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలి. ఇందులో ప్రదానంగా గోదావరి, కృష్ణల నుంచి వృధాగా సముద్రంలో కలుస్తున్న నీటిని వినియోగించడంపై నిపుణులతో చర్చించాలి. విభజనకు ముందువరకు కలసి వున్న మనం ఇప్పుడు జగడాలు పడడం తగనిపనిగా పాలకలు,రాజకీయ పార్టీలు,నేతలు గుర్తించాలి. సమస్యలను ఎగదోసే రాజకీయ పార్టీల నేతల తీరును ఎండగట్టాలి. పొరుగు రాష్ట్రాలతో గొడవలు వద్దనుకుంటున్న ఇరు తెలుగు రాష్ట్రాల సిఎంలు ఈ విషయంలో హుందాగానే ఉంటున్నందున సమిష్టిగా సమస్యలను పంచుకోవాలి. తెలంగాణ మంత్రులు కూడా సంయమనంతో సమస్యలను చర్చించాలి. ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో మన బంధాలు బలపడాలి. ప్రభుత్వాలు తమ వాటా నికర జలాలకు కట్టుబడి ఉంటూ, మిగులు జలాలను ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో సామరస్యంగా పరిష్కరించుకోవాలే తప్ప భావోద్వేగాలు రెచ్చ గొట్టడం వాంఛనీయం కాదు. నిజానికి కృష్ణా,గోదావరి చివరి బేసిన్‌లో ఉన్నవి తెలుగు రాష్ట్రాలే. ఈ రెండు రాష్ట్రాలు ఈ నీటిని ఎలా ఉపయోగించుకోవాల అన్నది నిర్ణయించుకోవాలి. దీనిద్వారా ఇరు రాష్ట్రాల రైతాంగం బాగుపడుద్ది. సముద్రంలోకి నీరు వృధాగా పోకుండా ఉమ్మడిగా ప్రాజెక్టులను నిర్మించకునే అవకాశాలను పరిశీలించాలి. ఘర్షణల వల్ల నష్టపోయేది రెండు రాష్ట్రాల్లోని తెలుగు ప్రజలే అని గమనించాలి.కేంద్రం కూడా బోర్డులు ఏర్పాటు చేసినా ఫలితం కానరావడం లేదు. సమస్యలను పెద్దవిగా చేయకుండా పరిష్కరించే మార్గాలను చూపుతూ శాశ్వతంగా సమస్యలకు చెక్ పెట్టగలగాలి. ఆల్మట్టి,నారాయణపూర్ ప్రాజెక్టుల కారణంగా కృష్ణా నది కిందనున్న ప్రాజెక్టులకు ఇప్పటికే నీరు సక్రమంగా అందడం లేదు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ కర్ణాటక, మహారాష్ట్రలకు కేటాయించిన అదనపు జలాలను వారు వినియోగించుకుంటే ఉభయ తెలుగు రాష్ట్రాలకు మిగులు జలాలు కాదుకదా బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన నికర జలాలకు కూడా గ్యారంటీ ఉండదు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కృష్ణాజలాల్లో తమ వాటాగా ఉన్న నికరజలాలకు గ్యారంటీని పొందడంతో పాటు బచావత్ ట్రిబ్యునల్ చెప్పిన పద్ధతిలో మిగులు జలాలను వినియోగించుకునే హక్కును తెలుగు రాష్ట్రాలు కాపాడు కోవాలి. ఇందుకోసం ముందుగా ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య పరస్పర విశ్వాసం, అవగాహన ఉండాలి. ఇరు రాష్ట్రాలు ఉమ్మడిగా కేంద్ర పెత్తనాన్ని ఎదుర్కోవలసి ఉంది. ఎవరివాటాలను వారు వాడుకునే విధంగా నడుచుకోవాలి. వివాదాన్ని కేంద్రమే పరిష్కరించాలని కోరడమనేది శత్రువుకు జుట్టు ఇచ్చినట్లు అవుతుంది. నీటి సమస్యలు భావోద్వేగాలను తీవ్రతరం చేయడం సరికాదు. అనేక సమస్యలను పరిష్కరించ లేని కేంద్రం ఇక జల వివాదాలను సరిదిద్దుతుందన్న నమ్మకం లేదు. అందువల్ల ఉన్న ఒప్పందాల మేరకు నడుచుకునే విధంగా తెలుగు రాష్ట్రాల సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు కూర్చుని మాట్లాడి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలి. పోతిరెడ్డిపాడు నుంచి కిందకు పూర్తిస్థాయిలో నీరు రావాలంటే శ్రీశైలంలో 881 అడుగులు నీళ్లు ఉండాలి. శ్రీశైలంలో పూర్తి నీటి మట్టం 885 అడుగుల నీళ్లు ఉన్న రోజులు గత 20 ఏళ్లలో ఏడాదిలో 20 నుంచి 25 రోజులు కూడా లేవు. ఇలాంటి సమయంలో పోతిరెడ్డిపాడుకు పూర్తి స్థాయిలో నీటిని తీసుకెళ్లలేని పరిస్థితి. మరోవైపు పాలమూరు రంగారెడ్డి, డిండి ప్రాజెక్టు, కల్వకుర్తి సామర్థ్యం పెంచి 800 అడుగులలోపే నీటిని తీసుకునే వెసులుబాటు తెలంగాణకు ఉందంటున్నారు. 796 అడుగుల వద్దే తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. 800 అడుగుల్లోపు లోనే మీకు కేటాయించిన నీటిని వాడుకుంటే తప్పులేనప్పుడు.. 881 అడుగులు ఉంటే తప్ప నీళ్లు వాడుకోలేని పరిస్థితి మాకున్నప్పుడు.. మేం 800 అడుగుల వద్దే మాకు కేటాయించిన నీటిని తీసుకోవడంలో తప్పేముందని ఎపి అధికారులు ప్రశ్నిస్తున్నారు. నిజానికి ఈ విషయాలపై స్పష్టత రావాలి. అలాగే రాజకీయంగా మరిన్ని చర్చలు చేయాలి. ఈ క్రమంలో నదీ జలాల పంపిణీ, నీటి పారుదల ప్రాజెక్టుల నిర్వహణ విషయమై రెండు తెలుగు రాష్ట్రాల మధ్య మరింత లోతుగా చర్చలు సాగాలి. నిజానికి సమస్య ఎక్కడుందో ఆలోచించాలి. ప్రజలకు తాగునీరు, సాగు అవసరాలు, జల విద్యుత్తు, పారిశ్రామిక అవసరాలు... ఇలా నీటి వినియోగ ప్రాధాన్యతలు అంతర్జాతీయ సూత్రాలకు అనుగుణంగా నిర్ణయించబడి ఉన్నాయి. ఆయా నియమాలను పాటిస్తూ, ఏవైనా ప్రత్యేక పరిస్థితులు ఏర్పడితే సర్దుబాటు చేసుకొని పరస్పరంగీకారంతో ఉమ్మడి ప్రాజెక్టులను నిర్వహించుకోవాలి. అప్పుడు కృష్ణా, గోదావరుల్లో మనకు ఉన్నంత నీరును సద్వినియోగం చేసుకోవచ్చు.

## అంగరంగ వైభవంగా సికింద్రాబాద్ బోనాల ఉత్సవాలు

మొదటిపేజీ తరువాయి..

దర్శించుకున్న సీఎం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మంత్రి కొండా సురేఖ అమ్మవారికి బోనం సమర్పించారు. ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఆ తల్లిని కోరుకున్నట్లు సీఎం తెలిపారు. సీఎంతో పాటు పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. హర్యానా గవర్నర్ బంగారు దత్తాత్రేయతోపాటు పలువురు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. లష్కర్ బోనాల సందర్భంగా ఇప్పటికే ఆలయ పరిసరాలు భక్తులతో కిటికటలాడుతున్నాయి. ఆషాడమాసంలో జరిగే బోనాల జాతరకు చాలా ప్రత్యకత ఉంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడే ఈ పండుగ సందర్భంగా జరుపుకుంటున్నారు. ఈ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయానికి 200 ఏళ్ల చరిత్ర ఉంది. తెలంగాణ వచ్చిన తర్వాత ప్రభుత్వం ఈ జాతరను ప్రతిష్టాత్మకంగా తీసుకుని వైభవంగా నిర్వహిస్తోంది. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర ఘనంగా ప్రారంభమయ్యే సందర్భంగా అమ్మవారికి తెల్లవారుజామునే మహా మంగళ హారతి ఇచ్చారు.

అమ్మవారిని హైదరాబాద్ జిల్లా ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు దర్శించుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు, తొలి బోనం సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలకు మంత్రి పొన్నం బోనాల ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మంచి వర్షాలు కురిసి పాడి పంటలతో రైతులంతా సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. అమ్మవారికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ బోనం సమర్పించారు.అమ్మవారిని బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, కుటుంబసమేతంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మా రావు దర్శించుకుని, అమ్మవారికి బోనం సమర్పించారు. హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ దత్తాత్రేయ, మాజీ మంత్రి మల్లారెడ్డి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద, సింగర్ మంగ్లీ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.జీవులకు పోషణ శక్తిని అందించే భోజనాన్ని యజ్ఞ ద్రవ్యంగా భగవద్గీతలో

పేర్కొన్నారు. ప్రాణశక్తి కారకమైన అన్నాన్ని బోనంగా ప్రకృతి శక్తులకు సమర్పించడం అమ్మతల్లి పట్ల ప్రజలు విధేయతను ప్రకటించడం. జానపదుల పలుకులతో రాను రాను కలానుక్రమంలో భోజనమే బోనమైంది. అమ్మా మీ అనుగ్రహం వల్ల లభించిన ఈ భోజనాన్ని బోనంగా మీకు భక్తి శ్రద్ధలతో సమర్పిస్తున్నాం నిరంతరం మా సమూహాన్ని ఇలాగే రక్షించండి అనే వినయంగా, గౌరవ పూర్వకమైన కోరికలే ఈ ఆషాఢ మాస బోనాలు.హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలలో శోభాయమానంగా జరుపుకొనే అతిపెద్ద ఉత్సవం బోనాల పండుగ. మొదటగా గోల్కొండ జగదంబ ఆలయంలో బోనాల ఉత్సవం ఆరంభమవుతుంది. అనంతరం బల్కంపేట ఎల్లమ్మ, సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజా సింహవాహిని మాత మహేశ్వరి, అక్కన్న మాదన్న మహంకాళి ఆలయాల్లో ఆషాఢం బోనాల జాతర శోభ వెల్లి విరుస్తుంది. ఉజ్జయిని మహంకాళికి నిర్వహించే బోనాల పండుగ సంబరంతో ఈ వేడుక నగరంలో ఆధ్యాత్మిక బలాన్ని నింపుతుంది.

## ప్రజల కోసమే ప్రతి రూపాయి ఖర్చు..




మొదటిపేజీ తరువాయి..

ఆసుపత్రుల ఏర్పాటు, నవీకరణ కార్యక్రమాలను చేపట్టింది. ఇందులో భాగంగా లక్షెట్టిపేట మండల కేంద్రంలో 8 కోట్ల 50 లక్షల రూపాయల ప్రభుత్వ నిధి, 1 కోటి రూపాయల సింగరేణి నిధులతో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించడం కొరకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.లక్షెట్టిపేట మండల కేంద్రంలో 10 కోట్ల 20 లక్షల రూపాయల సి.ఎస్.ఆర్., డి.ఎం.ఎఫ్.టి. నిధులతో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఏర్పాటు చేశాం. తరగతి గదులు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థిని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాం. డైట్ చార్జీలు 40 శాతం, కాస్మోటిక్ చార్జీలు 200 శాతం పెంచి నూతన మెనూ ఖచ్చితంగా అమలు

చేస్తూ విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాం. విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ ఉపాధ్యాయుల నియామకం ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాం.మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాల ద్వారా ప్రోత్సహిస్తున్నాం. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం రెబ్బెనపల్లి గ్రామంలో ఇందిరా మహిళా శక్తి సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళలకు చేయూతనిస్తూ దండేపల్లి మండలం అందుగులపేట (వెల్గనూర్) గ్రామంలో 4 ఎకరాల విస్తీర్ణంలో 3 కోట్ల రూపాయల వ్యయంతో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేశాం. 90 శాతం బ్యాంకు రుణం, 10 శాతం గ్రామ సంఘాల వాటాతో రోజుకు సుమారు 4 వేల 500 నుండి 5 వేల యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి జరిగి సంవత్సరానికి దాదాపు 51 లక్షల రూపాయల రాబడి వస్తుంది. నర్సింగాపూర్

గ్రామంలో 1 కోటి 63 లక్షల రూపాయల సి. ఎస్. ఆర్. నిధులతో 2/200 కి.మీ. నుండి 3/100 కి. మీ. కొరకు 900 మీటర్ల మేర సి.సి. రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. 80 లక్షల రూపాయల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో 4 గ్రామపంచాయతీ భవనాలు, 48 లక్షల రూపాయలతో 4 అంగన్వాడి భవనాల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. లక్షెట్టిపేట మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో 1 కోటి రూపాయలతో ఎస్.సి.ఎస్.డి.ఎఫ్. క్రింద సి. సి. రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం చేపట్టారు. హాజీపూర్ మండలం చిన్న గోపాల్ పూర్, ర్యాలీ గ్రామాలలో 2 కోట్ల 50 లక్షల రూపాయల ఎస్.టి.ఎస్.డి.ఎఫ్., ఎస్.సి.ఎస్.డి.ఎఫ్ నిధులతో నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వేంపల్లి, పోచంపహాడ్ శివారులలో 212 ఎకరాల భూమి విస్తీర్ణంలో 30 కోట్ల రపాయల వ్యయంతో అత్యాధునిక సదుపాయాలతో ఐ. టి./ ఇండస్ట్రియల్ పార్క్ ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

## ప్రేక్షకుల హృదయాల్లో చెదరని 'కోట'



మొదటిపేజీ తరువాయి..

పోషించారు కోటా శ్రీనివాసరావు. 750 కు పైగా చిత్రాల్లో నటించారు. కోట మృతిలో చిత్ర పరిశ్రమలో విషాదం నెలకొంది. ఆయన మృతిపై సినీ ప్రముఖులతో పాటు రాజకీయ నేతలు కూడా సంతాపం వ్యక్తం చేస్తున్నారు.కోట శ్రీనివాసరావు ఉమ్మడి కృష్ణా జిల్లా కృష్ణాజిల్లా కంకిపాడులో 1942 జూలై 10 న జన్మించారు. కోటా శ్రీనివాస్ తండ్రి సీతారామాంజనేయులు డాక్టర్. తండ్రిలా డాక్టర్ కావాలని చిన్నతనంలో అనుకున్నా.. చదువుకునే రోజుల్లో నాటక రంగంలో అడుగు పెట్టారు. దీంతో ఆయనకు నటనపై ఆసక్తి పెరిగి.. డిగ్రీ తర్వాత స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగం వచ్చినా నటననే వృత్తిగా చేసుకున్నారు. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళం సినిమాల్లో నటించారు.కోట శ్రీనివాసరావుది తెలుగు చలన చిత్ర పరిశ్రమలో ఒక ప్రత్యేకమైన శకం అని చెప్పవచ్చు. ఆయన ఎంచుకున్న పాత్రలో నటించేవారు కాదు జీవించేవారు అని చెప్పడంతో ఎటువంటి అతిశయోక్తి లేదు. అహనా పెళ్ళంట లో పిసినారిగా, గణేష్ సినిమాలో రాజకీయ వేత్తగా ఇలా ఏ పాత్రలో నైనా తనదైనశైలితో నటించేవారు. అవును ఆయన నటనలో పండించిన హాస్యం, ప్రదర్శించిన విలనిజం ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. విలన్ పాత్రల్లోనే లోనే హాస్యాన్ని పండించడంలో కోటా దిట్ట.కోటా శ్రీనివాసరావు భార్య రుక్మిణి.. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. కోటా శ్రీనివాస్ తనయుడు తండ్రి బాటలో సినిమాల్లో అడుగు పెట్టినా ..అదే సమయంలోనే ఒక యాక్సిడెంట్ లో ప్రాణాలు పోగొట్టుకున్నాడు. కొడుకు కోటా వెంకట ఆంజనేయ ప్రసాద్ అకాల మరణంతో ఆయన కుంగిపోయారు. కాగా కోటా తమ్ముడు శంకర్ రావు కూడా నటుడేకోటా శ్రీనివాస్ నటుడు మాత్రమే కాదు రాజకీయాల్లో కూడా అడుగు పెట్టారు. శ్రీనివాసరావు 1999 నుంచి 2004 వరకు విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా పనిచేశారు.కృష్ణాజిల్లా కంకిపాడులో 1942, జులై 10న జన్మించారు. బాల్యము నుండి కోటకు నాటకాలంటే చాలా ఆసక్తి. దీంతో చిన్న వయసు నుంచే నాటకాల్లో పాల్గొనేవారు. సినిమాలలో రాకముందు స్టేట్ బ్యాంకులో పనిచేసిన కోటా.. అదే సమయంలో నాటకాల్లో పాల్గొనేవారు. 1978 లో ప్రాణం ఖరీదు సినిమాతో సినీ రంగ ప్రవేశం చేశారు. ఈ సినిమాతో ఆయనకు తొలి అవకాశాన్ని ఇచ్చారు దర్శక నిర్మాత క్రాంతి కుమార్. ప్రతిఘటన చిత్రంతో విలన్ గా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.నాలుగు దశాబ్దాల సినీప్రయాణంలో దాదాపు 750కి పైగా సినిమాల్లో నటించారు. ఎన్నో అవార్డులు సొంతం చేసుకున్నారు. తండ్రిగా, తాతగా, రాజకీయ నాయకుడిగా, విలన్ గా ఇలా ఎన్నో పాత్రలు పోషించి మెప్పించారు. తన నటనతో విలనిజానికి కొత్త అర్థం చెప్పారు కోట శ్రీనివాసరావు.సినీరంగంలోనే కాకుండా రాజకీయాల్లోనూ తనదైన ముద్ర

వేశారు. మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్ ఒత్తిడితో రాజకీయాల్లోకి వచ్చారు. స్వతహాగా వాజ్ పేయి అంటే చాలా ఇష్టం. 1990లో బీజేపీలో చేరి 1999లో విజయవాడ తూర్పు నియోజక వర్గం నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు.ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఓటమి చవిచూసిన తర్వాత రాజకీయాల నుంచి విరమించుకుని మళ్లీ నటనలోనే కొనసాగారు. ఆ త్రవాత వందల సినిమాల్లో నటించి 2015లో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా పద్మ శ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. తన సినీ ప్రయాణంలో తొమ్మిది నంది పురస్కారాలు అందుకున్నారు. మరోవైపు టాలీవుడ్ విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు ఇక లేరన్న వార్తను టాలీవుడ్ ప్రముఖులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆయనను కడసారి దర్శనం కోసం క్యూ కట్టారు. ఈ సందర్భంగా కోటా శ్రీనివాసరావుతో తమకుండే అనుబంధాలు, మధుర క్షణాలను మరోసారి గుర్తుకు తెచ్చుకుని ఎమోషనల్ అవుతున్నారు. ఆయన చూపించిన బాట గొప్పది. ఆయన నడిచొచ్చిన దారి ఎంతో మందికి స్ఫూర్తిదాయకం. ఇప్పుడు ఎవరిని కదిలించినా ఈ మాటలే..విలక్షణమైన నటనకు పరిపూర్ణమైన రూపం కోట అన్నది మెగాస్టార్ మాట. వారిద్దరూ కలిసి సినిమా ప్రయాణాన్ని ప్రాణం ఖరీదుతో మొదలుపెట్టారు. సెట్లో కోట ఉంటే చమత్కారాలకు కొదవ ఉండదన్నది చిరు మాట.కోట శ్రీనివాసరావు నటించిన ఆఖరి సినిమా హరిహరవీరమల్లు. ఆ సినిమా కోసమే ఆయన చివరి సారి గళం విప్పారు. ఆ సినిమాతోనే కాదు.. అంతకు ముందు కూడా చాలా సినిమాల్లో పవర్‌స్టార్‌తో కలిసి నటించారు కోట శ్రీనివాసరావు. పవన్ కల్యాణ్‌కి ఇష్టమైన నటుడు కోట. చెప్పాలనుకున్న విషయాన్ని నిర్భయంగా చెప్పడంలో కోట తర్వాతే ఎవరైనా అన్నది పవన్ కల్యాణ్ మాట.ఇండస్ట్రీలో పవన్ కల్యాణ్ ఫస్ట్ సినిమా నుంచే కాదు, వెంకటేష్ ఫస్ట్ సినిమా నుంచి కూడా అనుబంధాన్ని పెంచుకున్నారు కోట. కలియుగ పాండవుల నుంచి వెంకటేష్‌తో అనుబంధం ఉంది కోట శ్రీనివాసరావుకి. సురేష్ ప్రొడక్షన్స్ లో చాలా సినిమాల్లో నటించారు కోట. అలాంటి వెర్సటైల్ యాక్టర్ ఇవాళ లేకపోవడం తనకు వ్యక్తిగతంగా తీరని లోటంటారు వెంకటేష్. శత్రువు, గణేష్ ఆడవారి మాటలకు అర్థాలే వేరులే%ౌ%ఇలా తమ కాంబినేషన్ గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే అన్నది విక్టరీ హీరో మాట.బాబాయ్ వెంకటేష్‌తో పాటు, అబ్బాయ్ రానా కూడా నివాళులర్పించారు. సురేష్ ప్రొడక్షన్స్ తో కోటకున్న బంధం గురించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అటు దిల్‌రాజు కూడా తమ సంస్థతో కోట శ్రీనివాసరావు చేసిన సినిమాలను గుర్తుచేసుకున్నారు. వైవిధ్యమైన పాత్ర, సంక్లిష్టమైన కేరక్టర్ ఉందంటే చటుక్కున గుర్తుకొచ్చే పేర కోటదే అని మనసులోని మాటలను వ్యక్తం చేశారు దిల్‌రాజు.సిల్వర్ స్క్రీన్ మీద శ్రీకాంత్‌కి తండ్రి రోల్స్ చేసిన వారిలో ప్రేక్షకులకు బాగా గుర్తుండిపోయే పేరు కోట శ్రీనివాసరావు. రియల్ లైఫ్‌లో కోటని బాబాయ్ అని పిలుస్తారు

## ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు..

మొదటిపేజీ తరువాయి..

కావడంలేదంటూ మల్లన్న ప్రసంగించారు. ఎమ్మెల్సీ మల్లన్న వ్యాఖ్యలపై భగ్గుమన్న జాగృతి శ్రేణులు.. ఆయన ఆఫీస్‌పై దాడి చేశారు. దీంతో ఆ ప్రాంతంలో హైటెన్షన్ కొనసాగుతోంది. కాగా మహిళలను అవమానించేలా మాట్లాడిన తీన్మార్ మల్లన్నను వెంటనే అరెస్ట్ చేయాలని మహిళా నాయకులు డిమాండ్ చేశారు. "బీసీ బిడ్డ అని ఏది పడితే అది మాట్లాడితే కుదరదు. మీరు మాట్లాడిన ఆవేశంలోనే ప్రజలు మీ ఆఫీసుకు వచ్చారు. కానీ మీరు గన్‌మెన్‌తో కాల్పులు జరిపించారు. ఇది ఎంతమాత్రం సరికాదు. ఒక ఆడపిల్లను లక్ష్యంగా చేసి ఈ స్థాయిలో మాట్లాడకూడదు. ఇది ప్రజాస్వామ్యం," అని వారు మండిపడ్డారు.

ఈ నేపథ్యంలో %మీాజ% కవిత మీడియాతో మాట్లాడుతూ "తెలంగాణ జాగృతిలో బీసీ ఉద్యమాలకు మేము కృషి చేశాం. ఇప్పుడు నన్ను టార్గెట్ చేయడం వెనుక ఏదో కుట్ర ఉంది. మల్లన్న చేసిన వ్యాఖ్యలు పూర్తిగా బాధాకరమైనవి. రేపు మేము ఉమెన్స్ కమిషన్‌ను కలవబోతున్నాం. మల్లన్నను వెంటనే సస్పెండ్ చేయాలి. ప్రజాస్వామ్యంలో అలా ఎవరు మాట్లాడినా మేము ఊరుకోం. మల్లన్నను వ్యక్తిగతంగా నేను ఎప్పుడూ టార్గెట్ చేయలేదు. కానీ ఆయన మాత్రం నన్ను తిట్టడానికి ప్రయత్నిస్తున్నారు. ఆడబిడ్డలను గౌరవించడం నేర్చుకోవాలి. ఎవరి దెబ్బలు వెనుక ఎవరు ఉన్నారో స్పష్టంగా తెలుస్తోంది" అని విమర్శలు గుప్పించారు. శాసన మండలి చైర్మన్‌ను కలసి మల్లన్నను సస్పెండ్ చేయాలని కూడా వారు విజ్ఞప్తి చేశారు.

## నేడు కొత్త రేషన్ కార్డుల పంపిణీ

మొదటిపేజీ తరువాయి..

కార్డులు ఇవ్వడం అనేవి మాకు చాలా సంతోషం, సంతృప్తిని ఇచ్చాయని పేర్కొన్నారు. ఇలాంటి పేదవారికి ఆహార భద్రత కల్పించే సంక్షేమ పథకాలు స్వతంత్ర భారతదేశంలోనే లేవని అన్నారు.గత పాలకులు 10 సంవత్సరాలలో ఒక్కటంటే ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదు. ఎన్నికలు ఉన్నప్పుడే రేషన్ కార్డులు విషయం తీసుకో వచ్చేవారు, కానీ ఇవ్వలేదు. కానీ మేము ప్రభుత్వంలోకి వచ్చాక 18 నెలలలోనే అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు ఇస్తామని, రేషన్ కార్డులు జారీ నిరంతర ప్రక్రియ అని తెలిపారు. పాతకార్డుల్లో అదనంగా చేర్చిన సభ్యులు 6,39,784 మందని అని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. మొత్తం 12,30,272 మంది రేషన్ అందుకుంటున్నారని ఆయన తెలిపారు. రెండోదశ ఈనెల 14వ తేదీ నుంచి లబ్ధిదారుల సంఖ్య 15,53,074 మందికి పెరగనుందని ఆయన వెల్లడించారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా, పారదర్శకతతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇదని ఉత్తమ్ తెలిపారు. కొత్త రేషన్ కార్డుల జారీ, పేర్లను చేర్చడం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై ఏడాదికి రూ.1150.68 కోట్ల ఆర్థిక భారం అదనంగా పడుతుందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయనుండటంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి పేరిట కొత్తగా రేషన్ కార్డులు మంజూరైన లబ్ధిదారులకు ఆహార భద్రత –కొత్త రేషన్ కార్డులు అంటూ లేఖలను ముద్రించారు. ఇలా ఒక్కో లబ్ధిదారుడి పేరుతో ముద్రించిన లేఖలను ఈ నెల 15 నుంచి పంపిణీ చేయడానికి రంగం సిద్ధమైంది. పంపిణీ ప్రక్రియపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇంకా రాలేదు.రాష్ట్ర ప్రభుత్వం నూతన రేషన్ కార్డుల జారీ కోసం లబ్ధిదారుల నుంచి



దరఖాస్తులను కులగణన, ప్రజాపాలన, మీ సేవ ద్వారా స్వీకరించింది. ప్రతి విభాగంలో లక్షల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. నూతన సభ్యుల చేరికకోసం(మ్యూటేషన్స్) దరఖాస్తు చేసుకునేందుకు కూడా అవకాశం కల్పించారు. వీరందరికీ సీఎం పేరిట పంపిన లేఖలో లబ్ధిదారుల రేషన్‌కార్డు సంఖ్య, రేషన్ షాప్ నంబర్, కుటుంబ సభ్యుల సంఖ్య, అందించే బియ్యం పరిమాణం పేర్కొంటారు.

## నేడు వ్యోమగాములు భూమికి తిరుగు పయనం

మొదటిపేజీ తరువాయి..

తెలిపింది. 18 రోజుల అంతరిక్ష యాత్రలో శుక్లా బృందం అనేక పరిశోధనలు జరిపింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో వివిధ ప్రయోగాలు చేసిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా బృందం తిరుగు పయనం కానుంది. భారత కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం 4:35 గంటలకు అన్ డాకింగ్ ప్రక్రియ జరగనుందని నాసా తెలిపింది. పలు ఆర్బిటల్ ప్రక్రియల తర్వాత ఈనెల15 మధ్యాహ్నం 3 గంటలకు కాలిఫోర్నియాతీరంలో క్రూ డ్రాగన్ స్పేస్ క్రాఫ్ట్ దిగనుంది. శుభాంశుతో పాటు పెగ్గీ విట్సన్, స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ-విస్నియెస్కీ, టిబర్ కపులు అంతరిక్షంలో భారరహిత స్థితిని అనుభవించిన కారణంగా భూమిపైకి చేరగానే ఇక్కడి వాతావరణానికి వారి శరీరాలు అలవాటు పడేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ఇస్రో పేర్కొంది. అందుకోసం వారంరోజులపాటు రిహాబిలిటేషన్ సెంటర్‌లో ఉంచనున్నట్లు తెలిపింది. ఇస్రోకు చెందిన వైద్యాధికారులు వ్యోమగాముల ఆరోగ్యం, ఫిట్‌నెస్‌ను నిరంతరం పర్యవేక్షిస్తారని వివరించింది.ఐఎస్ఎస్‌లో శుక్లా మైక్రోఅల్గీ ప్రయోగంపై పని చేశారని యాక్జియం స్పేస్ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. భవిష్యత్తులో దీర్ఘకాల అంతరిక్ష మిషన్ల కోసం ఆహారం, ఆక్సిజన్, బయో ఇంధనాలను అందించగలిగే నమూనాలను విస్తరించి, పాగు చేసినట్లు తెలిపింది. భూమి అవతల జీవనాన్ని సాగించడానికి మైక్రోఆల్గీ దోహదపడుతుందని వివరించింది. శుక్లా బృందం వాయేజర్ డిస్‌ప్లేస్ అధ్యయనం కూడా చేసినట్లు తెలిపింది. అంతరిక్ష యాత్ర వ్యోమగాముల కంటి కదలికలు, సమన్వయాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో కూడా పరిశీలించింది. వ్యోమగాములు కక్ష్యలో తమ పరిసరాలను ఎలా గ్రహిస్తారు, అక్కడ ఎలా మనుగడ సాగిస్తారో కూడా అధ్యయనం చేసింది. ఇది దీర్ఘకాల మిషన్ల కోసం సహాయ పడడం సహా నివాస స్థలాలను రూపొందించడానికి కీలకమని యాక్జియం పేర్కొంది. సెరిబ్రల్ రక్త ప్రవాహంపైనా వ్యోమగాముల బృందం అధ్యయనం జరిపింది. అంతరిక్షంలో మైక్రోగ్రావిటీ, ఎక్కువ కార్బన్ డయాక్సైడ్ స్థాయిలు హృదయనాళ విధులను ఎలా ప్రభావితం చేస్తాయో పరిశోధించింది. ఇది తర్వాత అంతరిక్ష యాత్రకు వెళ్లేవారికి, భూమిపై రోగులకు కూడా ఉపయోగపడుతుందని యాక్జియం సంస్థ తెలిపింది.యాక్సియం-4 మిషన్ ద్వారా శుభాంశు తో పాటు పెగ్గీ విట్సన్, స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ-విస్నియెస్కీ, టిబర్ కపు ఫ్లోరిడాలోని కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుంచి గతనెల 25న నింగిలోకి దూసుకెళ్లారు. 28 గంటల ప్రయాణం తర్వాత ఐఎస్ఎస్‌లో ప్రవేశించారు. 18 రోజులుగా ఐఎస్ఎస్‌లో ఉన్న శుభాంశు శుక్లా ఏకంగా 96.5 లక్షల కిలోమీటర్ల దూరం ప్రయాణించినట్లు యాక్సియం స్పేస్ వెల్లడించింది.

## భారత్‌లో మరో 'బ్రహ్మోస్' పరీక్షా కేంద్రం

మొదటిపేజీ తరువాయి..

అవకాశాలు కూడా లభిస్తాయన్నారు. ఆదివారం లఖ్‌నవూలోని నేషనల్ పీజీ కాలేజీలో ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత కాంగ్రెస్ సీనియర్ నేత చంద్రభాను గుప్తా విగ్రహాన్ని, స్మారక పోస్టల్ స్టాంపును ఆయన ఆవిష్కరించారు.భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చంద్రభాను గుప్తా కీలక పాత్ర పోషించారని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. అధికారం అంటే పదవులు, హోదాలు మాత్రమే కాదని, బాధ్యత, త్యాగం, ప్రజా ప్రయోజనాల పరిరక్షణ అందులో కీలక భాగాలనే సందేశాన్ని ఇచ్చేలా చంద్రభాను గుప్తా జీవించారని కొనియాడారు. రాజకీయ విభేదాలు ఉండొచ్చు కానీ, శత్రుత్వాలు ఉండొద్దనే గొప్ప సందేశాన్ని ఆయన అందించారని రక్షణమంత్రి పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ లాంటి పెద్ద రాష్ట్రానికి మూడుసార్లు సీఎంగా సేవలు అందించినా, జాతీయ ఎజెండాతోనే చంద్రభాను గుప్తా ముందుకు సాగారని గుర్తు చేశారు. ఈక్రమంలోనే 1963లో 'కామరాజ్ ప్లాన్' కారణంగా సీఎం పదవికి ఆయన రాజీనామా చేశారని రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు. ప్రజల మద్దతుతో సీఎం అయిన ఒక నేత, కేవలం కొంతమంది అయిష్టత కారణంగా గద్దె దిగిపోవడం ఆనాడు ఎలా జరిగి ఉంటుందో మనం ఊహించుకోవచ్చన్నారు. సీనియర్ నేతలంతా మంత్రి పదవులను వదులుకొని, కాంగ్రెస్ పార్టీ బాధ్యతలను చేపట్టాలని 1963లో నెహ్రూకు మద్రాస్ మాజీ సీఎం కె.కామరాజ్ సిఫారసు చేశారు. దీన్నే 'కామరాజ్ ప్లాన్' అంటారు. దీనికి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) ఆనాడు ఆమోదముద్ర వేసింది. రెండు నెలల్లోనే కామరాజ్ ప్లాన్‌ను అమల్లోకి తెచ్చారు. ఇందులో భాగంగా ఆరు రాష్ట్రాల సీఎంలు, ఆరుగురు కేంద్ర మంత్రులు రాజీనామా చేశారు. ఆనాడు అకస్మాత్తుగా పదవులు కోల్పోయిన ఆరు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలలో చంద్రభాను గుప్తా ఒకరు. మరోవైపు 1963 అక్టోబరు 9న కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా కామరాజ్ ఎన్నికయ్యారు.స్వాతంత్ర్య ఉద్యమ కాలం నాటి 'కాకోరీ ఘటన' శతాబ్ది ఉత్సవాలను లఖ్‌నవూలో ఘనంగా నిర్వహిస్తామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ప్రకటించారు. లఖ్‌నవూకు సమీపంలోని కాకోరీ రైల్వే స్టేషన్‌లో ఆనాడు చోటుచేసుకున్న ఘటన నేటికీ అందరికీ గుర్తుందన్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఈ ఉత్సవాలను జరుపుతామని తెలిపారు. 1925 ఆగస్టు 9న కాకోరీ గ్రామం వద్ద ఓ రైలు నుంచి బ్రిటీష్ ప్రభుత్వపు నిధులను హిందుస్తాన్ రిపబ్లికన్ అసోసియేషన్ విప్లవ యోధులు స్వాధీనం చేసుకున్నారని ఆయన చెప్పారు.



# ఎండ నుంచి చర్మాన్ని కాపాడతాయి

వేసవి కాలంలో చాలామందికి ఎదురయ్యే సమస్యల్లో చర్మం కందిపోయి నల్లగా మారడం కూడా ఒకటి. మరి, అలా జరగకుండా ఉండడానికే బయటికి వెళ్లేముందు సన్‌స్క్రీన్ లోషన్ రాసుకుంటాం.. అంటారా..? అయితే సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాలతో పోరాడే శక్తి మనం ఆహారంగా తీసుకునే కొన్ని పదార్థాలలోనూ ఉంటుందంటున్నారు నిపుణులు.

వేసవి కాలంలో చాలామందికి ఎదురయ్యే సమస్యల్లో చర్మం కందిపోయి నల్లగా మారడం కూడా ఒకటి. మరి, అలా జరగకుండా ఉండడానికే బయటికి వెళ్లేముందు సన్‌స్క్రీన్ లోషన్ రాసుకుంటాం.. అంటారా..? అయితే సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాలతో పోరాడే శక్తి మనం ఆహారంగా తీసుకునే కొన్ని పదార్థాలలోనూ ఉంటుందంటున్నారు నిపుణులు. అందులో ఉండే కొన్ని రకాల పోషకాలు, సమ్మేళనాలే చర్మంపై ఎండ పడినప్పుడు కందిపోకుండా కాపాడతాయట. మరి ఆ పదార్థాలేంటో తెలుసుకుందామా..?

ఈ పండ్లు..

ఎండ కారణంగా చర్మం కందిపోకుండా ఉండడానికి పండ్లు ఎంతగానో సహకరిస్తాయి. ముఖ్యంగా దానిమ్మ, స్ట్రాబెర్రీ, జామ.. వంటి పండ్లలో ఉండే పోషకాలు ఇందుకు బాగా దోహదం చేస్తాయి. దానిమ్మలో పుష్కలంగా లభించే ఎల్లాజిక్ ఆమ్లం సూర్యరశ్మి నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాలు మేనుపై పడకుండా అడ్డుకుంటుంది. అలాగే చర్మంలో కొత్త కణాలను ఉత్పత్తి చేసి చర్మ ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది. ఇక స్ట్రాబెర్రీలో అధికంగా లభించే విటమిన్ సి కూడా ఈ సమస్య దరిచేరకుండా కాపాడుతుంది. అలాగే బ్లూబెర్రీ, రాస్ప్బెర్రీ.. వంటివి కూడా ఎండ నుంచి చర్మాన్ని రక్షించడంలో సమర్థంగా పనిచేస్తాయి. ప్రస్తుతం ఏ కాలంలోనైనా విరివిగా లభించే జామ పండులో ఉండే యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి ఎండ నుంచి చర్మాన్ని రక్షించడంతో పాటు చర్మ క్యాన్సర్, ఇతర మేని సంబంధిత సమస్యలు రాకుండా సంరక్షిస్తాయి. వీటితో పాటు పుచ్చకాయ, కివీ, యాపిల్.. వంటి పండ్లూ చర్మానికి ఎండ నుంచి రక్షణ కల్పిస్తాయి.

గ్రీన్ టీ తాగుతున్నారా?

గ్రీన్ టీ.. అధిక బరువు సమస్యతో బాధపడేవారు, ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించేవారు ఈ టీ తాగుతుంటారు. ఇందులో ఉండే పోషకాలు ఆరోగ్యం, ఫిట్నెస్పరంగా దోహదం చేయడం మాత్రమే కాదు.. ఎండ నుంచి చర్మానికి తగిన రక్షణ సైతం కల్పిస్తాయి. ముఖ్యంగా ఇందులో ఉండే ట్యానికామ్లం, ఇతర సమ్మేళనాలు ఎండ కారణంగా చర్మం కందిపోకుండా కాపాడతాయి. కాబట్టి గ్రీన్ టీ తాగే వారిలో సన్బర్న్ సమస్య చాలా తక్కువగా ఉంటుందంటున్నారు శాస్త్రవేత్తలు.

టొమాటోతో టాటా..

మార్చితో మొదలయ్యే ఎండలు దాదాపు జూన్ వరకూ కొనసాగుతాయి. ఈ మూడునాలుగు నెలల పాటు చర్మాన్ని ఎండ నుంచి సంరక్షించుకోవాలంటే కొద్దిగా ఆలివ్ నూనెలో పావు కప్పు టొమాటో పేస్ట్ను కలుపుకొని రోజూ తీసుకోవడం వల్ల ఎండ వల్ల చర్మం కందిపోకుండా జాగ్రత్తపడచ్చు. ఎందుకంటే టొమాటోలో ఎక్కువగా లభించే లైకోపీన్ అనే యాంటీఆక్సిడెంట్ అతినీలలోహిత కిరణాల నుంచి చర్మానికి అధిక సమయం రక్షణ కల్పిస్తుంది. అంతేకాదు.. ఈ రెండు పదార్థాలూ ఆరోగ్యానికీ ఎంతో మంచివి.

ఆలూతో..

బంగాళాదుంప.. దీంతో చేసిన వంటకాలంటే చాలామందికి ఇష్టం. అయితే ఇది సూర్యరశ్మి నుంచి చర్మాన్ని కాపాడడంలో బాగా సహకరిస్తుంది. ఇది మేనిమెరుపుకీ ఉపయోగపడుతుంది. ముఖ్యంగా ఇందులో ఉండే పిండి పదార్థాలు ఎండ వల్ల చర్మం కందిపోకుండా రక్షిస్తాయి. ఈ క్రమంలో బంగాళాదుంపను మెత్తగా చేసుకొని చర్మంపై ఎండ తగిలే ప్రదేశంలో రాస్తే సరి..!

## పోషకాల ఖర్జూరాలు.. అందుకే ఎంతో మేలు!

రంజాన్ మాసంలో ఆచరించే కఠిన ఉపవాస దీక్షకు అత్యంత ప్రాధాన్యం ఉంది. రోజూ ఈ దీక్ష విరమించేటప్పుడు తీసుకునే ఆహార పదార్థాల్లో 'ఖర్జూరాలు' తప్పకుండా ఉంటాయి. శరీరానికి తక్షణ శక్తినిచ్చే ఈ పండు ఆరోగ్యపరంగానూ ఎంతో మేలు చేస్తుందంటున్నారు నిపుణులు.

రంజాన్ మాసంలో ఆచరించే కఠిన ఉపవాస దీక్షకు అత్యంత ప్రాధాన్యం ఉంది. రోజూ ఈ దీక్ష విరమించేటప్పుడు తీసుకునే ఆహార పదార్థాల్లో 'ఖర్జూరాలు' తప్పకుండా ఉంటాయి. శరీరానికి తక్షణ శక్తినిచ్చే ఈ పండు ఆరోగ్యపరంగానూ ఎంతో మేలు చేస్తుందంటున్నారు నిపుణులు.

పొటాషియం ఎక్కువగా లభించే ఖర్జూరాలు తినడం వల్ల గుండె కొట్టుకునే రేటు, రక్తపోటు అదుపులో ఉంటాయి. అలాగే గుండె సంబంధిత సమస్యలు దరిచేరకుండా జాగ్రత్తపడచ్చు.

ఖర్జూరం పండ్లలో శరీరానికి కావాల్సిన ఖనిజాలు, విటమిన్లు, ఇతర పోషకాలు అధికంగా ఉంటాయి. ఇవి సంపూర్ణ ఆరోగ్యానికి చాలా అవసరం.

ఖర్జూరాల్లో కొలెస్ట్రాల్, క్యాలరీలు తక్కువగా.. ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి ఇవి తింటే ఎక్కువసేపు కడుపు నిండుగా ఉన్న భావన కలిగి.. బరువు అదుపులో ఉంచుకోవచ్చు.

ఖర్జూరం పండ్లలో యాంటీఆక్సిడెంట్ల రూపంలో ఉండే విటమిన్ 'ఎ' కంటికి చాలా మంచిది. ఈ పండు వల్ల రేచీకటి, ఇతర కంటి సమస్యలు కూడా దూరమవుతాయి.

క్యాల్షియం, మెగ్నీషియం, కాపర్.. వంటి ఖనిజాలు ఈ పండులో అధికంగా లభిస్తాయి. క్యాల్షియం ఎముకలను, దంతాలను దృఢంగా ఉంచడానికి.. కాపర్ ఎర్రరక్తకణాల ఉత్పత్తికి.. మెగ్నీషియం ఎముకల ఆరోగ్యానికి ఉపయోగపడతాయి.

ఖర్జూరాలు కేవలం బరువు తగ్గడానికి మాత్రమే కాదు.. బాగా సన్నగా ఉండి బరువు పెరగాలనుకునే వారికీ మంచి ఫలితాన్నిస్తాయి.

ఖర్జూరం పండు శరీరానికి తక్షణ శక్తినిస్తుంది. అందుకే రంజాన్ ఉపవాస దీక్షల సమయంలో ఈ పండుని ఆహారంగా తీసుకుంటారు.

మలబద్ధకంతో బాధపడేవారు కొన్ని ఖర్జూరాల్ని రాత్రంతా నీటిలో నానబెట్టి ఉదయాన్నే పరగడుపున వాటిని తిని, ఆ నీరు తాగితే మంచి ఫలితం ఉంటుంది.

ఖర్జూరంలో ఉండే వివిధ పోషకాలు శరీరంలోని జీవక్రియలను వేగవంతం చేస్తాయి.

ఖర్జూరాల్లో ఉండే విటమిన్ 'బి6' వల్ల మెదడు చురుగ్గా పనిచేస్తుంది.

శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలోనూ ఖర్జూరాలు తమ వంతు పాత్ర పోషిస్తాయి.

మూత్రనాళ ఇన్ఫెక్షన్లు, మూత్రపిండాల్లో రాళ్లు, మూత్రం సరిగ్గా రాకపోవడం.. మొదలైన సమస్యలతో బాధపడేవారు ఖర్జూరం తినడం మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.



# సన్‌ఫ్లవర్ గింజలతో.. కొత్త మెరుపు!



చర్మంపై పేరుకొన్న జిడ్డు, మురికి కారణంగా మొటిమలు రావడం, చర్మం నిర్జీవంగా తయారవడం లాంటివి జరుగుతాయి. వేసవిలో ఇలాంటి సమస్యలు మరింత అధికం. అయితే ఇలాంటి సమస్యలన్నిటికీ పొద్దు తిరుగుడు గింజలతో చెక్ పెట్టచ్చు.చర్మంపై పేరుకొన్న జిడ్డు, మురికి కారణంగా మొటిమలు రావడం, చర్మం నిర్జీవంగా తయారవడం లాంటివి జరుగుతాయి. వేసవిలో ఇలాంటి సమస్యలు మరింత అధికం. అయితే ఇలాంటి సమస్యలన్నిటికీ పొద్దు తిరుగుడు గింజలతో చెక్ పెట్టచ్చు.

### చర్మం శుభ్రపడటానికి..

సన్ఫ్లవర్ గింజలతో తయారుచేసిన స్క్రబ్ ఉపయోగించడం ద్వారా చర్మం, చర్మరంధ్రాలు శుభ్రపడి కొత్త కళ సంతరించుకొంటుంది. ఈ ఫలితాన్ని పొందడానికి.. అరకప్పు పొద్దుతిరుగుడు గింజలను తీసుకొని మిక్సీలో వేసి పొడిలా తయారుచేసుకోవాలి. దీనికి కొద్దిగా నీరు కలిపి చిక్కటి మిశ్రమంలా చేసుకొని గాజు సీసాలో వేసి ఫ్రిజ్లో భద్రపరుచుకోవాలి. ఈ మిశ్రమంతో రోజూ ముఖాన్ని, మెడను రుద్దుకొంటూ ఉంటే.. చర్మం శుభ్రపడటంతో పాటు తగిన పోషణ అంది ఆరోగ్యంగా తయారవుతుంది.

### పొడిబారిన చర్మానికి..

పొద్దుతిరుగుడు గింజలను రెండు నుంచి మూడు గంటల పాటు ఎండలో ఉంచాలి. ఆ తర్వాత వాటిని మిక్సీలో వేసి పొడిలా చేసుకోవాలి. ఇలా చేసేటప్పుడు మరీ మెత్తగా కాకుండా.. కాస్త గరుకుగా ఉండేలా చూసుకోవాలి. దీన్ని గాజు సీసాలో భద్రపరుచుకోవాలి. ఇలా తయారుచేసిన పొడిని టీస్పూన్ పరిమాణంలో తీసుకొని.. దీనికి మరో టీస్పూన్ వెన్న తొలగించని పాలు, చిటికెడు పసుపు కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసుకొని పావుగంట నుంచి 20 నిమిషాల పాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత కడిగేస్తే సరిపోతుంది. ఈ ప్యాక్ ముఖంపై పేరుకొన్న మురికిని తొలగిస్తుంది. చర్మానికి తేమనందించి పొడి చర్మం సమస్య నుంచి విముక్తి కలిగిస్తుంది. అలాగే చర్మఛాయ సైతం మెరుగుపడుతుంది. ఈ ప్యాక్ని వారానికోసారి వేసుకోవడం ద్వారా చక్కటి ఫలితం కనిపిస్తుంది.

### మిశ్రమ చర్మతత్వం ఉంటే..

మిశ్రమ చర్మతత్వం కలిగిన వారికి చర్మంపై ప్యాచెస్ మాదిరిగా అక్కడక్కడా పొడిగా కనిపిస్తూ ఉంటుంది. ఇలాంటి వారికి పొద్దుతిరుగుడు గింజలతో తయారుచేసిన ఫేస్ప్యాక్ చక్కగా నప్పుతుంది. దీనికోసం పై పద్ధతిలో తయారుచేసి పెట్టుకొన్న సన్ఫ్లవర్ గింజల పొడిని టీస్పూన్ తీసుకోవాలి.

దీనికి కొద్దిగా గంధం పొడి, రోజ్వాటర్ కలిపి మిశ్రమంగా తయారుచేసుకోవాలి. దీన్ని ముఖానికి అప్లై చేసుకోవాలి. ఇరవై నిమిషాల తర్వాత తడివస్త్రంతో ముఖం తుడుచుకొని శుభ్రం చేసుకోవాలి. ఈ ప్యాక్ వేసుకోవడం వల్ల ముఖంపై డ్రై ప్యాచెస్ పోవడంతో పాటు.. చర్మం సైతం అందంగా కనిపిస్తుంది.

# కిడ్డీపూల్.. ఇలా శుభ్రం చేయాలట!



స్విమ్మింగ్ పూల్ తరహాలోనే కొంతమంది పిల్లల కోసం కిడ్డీపూల్ని ఉపయోగిస్తుంటారు. పిల్లలు ఇందులో ఆడుకొని సేదదీరడానికి ఇది చక్కగా ఉపయోగపడుతుంది. అయితే ఈ నీటిలో బ్యాక్టీరియా, పాచి పెరగకుండా పూల్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం ముఖ్యమంటున్నారు నిపుణులు.స్విమ్మింగ్ పూల్ తరహాలోనే కొంతమంది పిల్లల కోసం కిడ్డీపూల్ని ఉపయోగిస్తుంటారు. పిల్లలు ఇందులో ఆడుకొని సేదదీరడానికి ఇది చక్కగా ఉపయోగపడుతుంది. అయితే ఈ నీటిలో బ్యాక్టీరియా, పాచి పెరగకుండా పూల్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం ముఖ్యమంటున్నారు నిపుణులు. లేదంటే ఇవి పిల్లల ఆరోగ్యంపై దుష్ప్రభావాన్ని చూపుతాయని చెబుతున్నారు.

పూల్ని శుభ్రం చేయకపోతే అందులో ఉండే క్రిములు, బ్యాక్టీరియా, నీటిలో ఉండే పాచి, చెత్త, దోమ గుడ్లు.. మొదలైనవి పిల్లల ఆరోగ్యానికి హాని కలగజేస్తాయి. అంతేకాకుండా చంటిపిల్లల విసర్జితాల వల్ల కిడ్డీపూల్ అపరిశుభ్రంగా తయారవుతుంది. కాబట్టి పూల్ని క్రమం తప్పకుండా శుభ్రం చేయాలి.

బ్లీచ్తో..

కిడ్డీపూల్ని బ్లీచ్, బోరాక్స్తో శుభ్రం చేయచ్చు. బ్లీచ్ దుస్తులపై పడే జిడ్డు మరకల్ని పోగొట్టి వాటిని తెల్లగా చేస్తుంది. దీన్ని బాత్రూమ్స్, కిచెన్ని కడగడానికి కూడా ఉపయోగిస్తారు. బ్లీచ్లో బలమైన బ్యాక్టీరిసైడల్ ధర్మాలుంటాయి. ఇవి కిడ్డీపూల్లో ఉండే హానికరమైన క్రిములను నాశనం చేస్తాయి. అవసరమైతే దీనికి క్లోరిన్ కూడా కలపచ్చు.

ప్రతివారం కిడ్డీపూల్ని శుభ్రపరచి, ఎండబెట్టి, తిరిగి నీరు నింపాలి. పెద్ద కిడ్డీ పూల్స్ అయితే.. నీరు నింపడానికి వాటి అవసరాన్ని బట్టి ఒక పంపు, ఫిల్టర్ను ఏర్పాటు చేయచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

శుభ్రం చేయడానికి ఉపయోగించే రసాయనాలను తగు మోతాదులో వాడాలి. ఈ క్రమంలో పూల్ సరఫరా చేసే కంపెనీ సూచనలు పాటిస్తే మంచిది.

పిల్లలు పూల్లో ఆడుకుంటున్నప్పుడు మీ పర్యవేక్షణ చాలా అవసరం.

స్విమ్మింగ్కు ముందు పూల్ని చక్కగా శుభ్రపరచాలి. అలాగే పూల్లో అడుగుపెట్టే ముందు పిల్లల పాదాలను కూడా శుభ్రంగా కడగాలి.

ఒకవేళ నీరు మురికిగా ఉంటే.. ఆ నీటిని పారబోసి, పూల్ని ఎండబెట్టి మళ్లీ నీరు నింపాలి.



# లక్షల జీతం వద్దనుకుని.. చీరల వ్యాపారం ప్రారంభించి..!



సాధారణంగా ఐఐటీ, ఐఐఎం.. వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో చదువుకున్న వారు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగం సాధించాలని, అత్యధిక వేతన ప్యాకేజీ అందుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంటారు..

చాలామందిలాగే గురుగ్రామ్కు చెందిన రాధికా మున్షీ కూడా తాను పెట్టుకున్న ఈ లక్ష్యాన్ని చేరుకుంది.సాధారణంగా ఐఐటీ, ఐఐఎం.. వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో చదువుకున్న వారు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగం సాధించాలని, అత్యధిక వేతన ప్యాకేజీ అందుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంటారు.. చాలామందిలాగే గురుగ్రామ్కు చెందిన రాధికా మున్షీ కూడా తాను పెట్టుకున్న ఈ లక్ష్యాన్ని చేరుకుంది. కొన్నాళ్లు ఎంతో ఉత్సాహంగా విధుల్లో కొనసాగింది. అయితే ఒకానొక సమయంలో తన ఉద్యోగంలో అసంతృప్తికి లోనైన ఆమె.. తన అంతిమ లక్ష్యం ఉద్యోగం కాదు, వ్యాపారమన్న విషయాన్ని గ్రహించింది. నెల తిరిగేసరికి లక్షలు కురిపించే ఉద్యోగాన్ని వదిలేస్తానంటే అందరూ వారించారు. అయినా వాళ్ల మాటలు పట్టించుకోకుండా వ్యాపారంలోకొచ్చి పలు సవాళ్లు ఎదుర్కొందామె. అయినా స్వీయ నమ్మకమే తన వ్యాపారాన్ని నిలబెట్టిందంటోన్న రాధిక.. తన వ్యాపార ప్రయాణాన్ని ఓ షార్ట్ వీడియో రూపంలో ఇటీవలే ఇన్స్టాలో పంచుకుంది. ప్రస్తుతం అది వైరలవుతోంది.

### ఐఐటీల్లో చదవాలని..!

గురుగ్రామ్కు చెందిన రాధికది మధ్యతరగతి కుటుంబం. చిన్నతనం నుంచి చదువు, ఇతర వ్యాపకాల్లో చురుగ్గా ఉండే ఆమె.. స్కూలింగ్లోనే ఐఐటీ, ఐఐఎం.. వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో చదవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్రమంలోనే ఇంటర్లో చక్కటి ప్రతిభ కనబరిచిన ఆమె.. ఐఐటీరూర్కీలో 'బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్' పూర్తిచేసింది. ఇందులో టాప్2 ర్యాంకు సాధించిన రాధిక.. ఆపై 'ఐఐఎంఅహ్మదాబాద్'లో ఎంబీఏ చదివింది. తాను కోరుకున్నట్లుగానే మాస్టర్స్ చదివే క్రమంలో క్యాంపస్ ప్లేస్మెంట్స్లోనే ప్రముఖ సంస్థలో ఉద్యోగం సంపాదించిందామె. మంచి ఉద్యోగం, లక్షల్లో జీతం.. ఇలా చిన్న వయసులోనే తన లక్ష్యాన్ని చేరుకోవడంతో ఆమె సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి. ఇదే ఉత్సాహంతో ఉద్యోగంలో చేరింది రాధిక.

### 'వ్యాపారమా? వద్ద'న్నారు!

'తానొకటి తలిస్తే.. దైవం మరొకటి తలచినట్లు..' నచ్చిన ఉద్యోగంలోనే చేరినా, లక్షల కొద్దీ జీతం అందుకుంటున్నా.. రోజులు గడిచే కొద్దీ ఉద్యోగంపై ఆసక్తిని క్రమంగా కోల్పోయింది రాధిక. దాంతో తన అంతిమ లక్ష్యం ఇది కాదని గ్రహించిందామె. అయితే నిత్యం సవాళ్లను ఎదుర్కోవడానికి ఇష్టపడే ఆమె.. సవాళ్లతో కూడిన వ్యాపార రంగంలోకి అడుగుపెట్టాలనుకుంది.'నచ్చిన ఉద్యోగంలో చేరాక కొన్నాళ్లు ఉత్సాహంగానే అనిపించింది. కానీ తర్వాతర్వాత నా అంతిమ లక్ష్యం ఇది కాదని గ్రహించా. ఏదో తెలియని అసంతృప్తి వెంటాడేది. అయితే నేనో పెద్ద శారీ లవర్ని. ఈ ఇష్టాన్నే వ్యాపారంగా ఎందుకు మలచుకోకూడదు? అని ఆలోచించా. ఈ క్రమంలోనే ఉద్యోగం వదిలేసి చీరల వ్యాపారం చేస్తానంటే అటు మా ఇంట్లో వాళ్లు, ఇటు స్నేహితులు ఎవరూ ఒప్పుకోలేదు. బంగారం లాంటి ఉద్యోగం వదిలేసి చీరలు అమ్ముతావా? అందులో నష్టం వస్తే ఏం చేస్తావ్? అంటూ నిరాశపరచాలని చూశారు. అయినా ధైర్యం చేశా.. అలా 2023లో అనోరాపేరుతో ఓ శారీ బ్రాండ్ని ప్రారంభించా..' అంటూ తన వ్యాపార ప్రయాణం ప్రారంభమైన తీరు గురించి చెబుతోంది రాధిక.

### లైట్వెయిట్ శారీస్.. మా ప్రత్యేకత!

సాధారణంగా వ్యాపారమంటేనే సవాళ్లతో కూడుకున్నది. పైగా నష్టాలొచ్చినా నిలదొక్కుకునే ధైర్యం ఉండాలి. ఈ ధైర్యంతోనే తన శారీ లేబుల్ని ప్రారంభించిన రాధిక మొదట్లో పలు ఒడిదొడుకుల్నీ ఎదుర్కొంది. అయినా అక్కడే ఆగిపోకుండా.. పట్టుదలతో ముందుకు సాగిందామె.'ఎందుకో తెలియదు కానీ.. మహిళలు వ్యాపార రంగంలో రాణించలేరన్న అభిప్రాయమే ఈ సమాజంలో ఎక్కువగా ఉంది. ఇలా ఎదుటివారి మాటలు విన్నప్పుడు మొదట్లో నా శక్తిసామర్థ్యాలపై నాకే సందేహం కలిగింది. అసలు నేను సరైన దారిలోనే వెళ్తున్నానా? నా చీరలు ఈతరం అమ్మాయిలకు/మహిళలకు నచ్చుతాయా? అనిపించేది. అయితే వాళ్ల అభిరుచులేంటో తెలుసుకొని చీరలు రూపొందించడం ప్రారంభించాక.. ఈ అనుమానాలన్నీ పటాపంచలయ్యాయి. క్రమంగా నా బ్రాండ్కు ఆదరణ పెరిగింది. ఈ తరం మహిళలు ఆయా ప్రత్యేక సందర్భాల్లో ధరించేలా విభిన్న చీరలు రూపొందిస్తున్నా. పండగలు, పెళ్లిళ్లు, పెళ్లి వేడుకలు, ఆఫీస్ పార్టీలు, నైట్పార్టీస్.. ఇలా విభిన్న అకేషన్స్ కోసం సంప్రదాయ, మోడ్రన్ శారీస్ డిజైన్ చేస్తున్నాం. అలాగే టై అండ్ డై, హ్యాండ్ ప్రింటెడ్, ఎంబ్రాయిడరీ, ప్రింటెడ్ తరహా చీరలు కూడా మా వద్ద లభిస్తున్నాయి. చీరకట్టుతోనూ ఈ తరం మహిళలకు సౌకర్యాన్ని అందించడమే మా లేబుల్ ప్రత్యేకత! అందుకే మా దగ్గర రూపొందించే లైట్ వెయిట్ శారీస్ని ఎక్కువమంది మహిళలు ఇష్టపడుతున్నారు..' అంటూ తన వ్యాపారం గురించి చెబుతోంది రాధిక. ఎన్ని సవాళ్లు ఎదురైనా నచ్చిన పని చేయడంలో సొంతమయ్యే సంతృప్తి అత్యధిక జీతం అందుకునేటప్పుడూ కలగదని చెబుతోన్న ఈ యంగ్ ఆంత్రప్రెన్యూర్.. తమ అభిరుచులకు తగినట్లుగా కెరీర్ని ఎంచుకున్నప్పుడే రాణించగలం అని చెబుతోంది.

### చిట్యాల లారీ అసోసియేషన్

## అధ్యక్షుడిగా పాటి దివాకర్ రెడ్డి ఎన్నిక

– లారీ ఓనర్స్, డ్రైవర్స్, సమస్యలపై కృషి చేస్తా: పాటి దివాకర్ రెడ్డి





**చిట్యాల జులై 13(సాక్ష్యం న్యూస్):** నల్గొండ జిల్లా, నకిరేకల్ నియోజకవర్గం, చిట్యాల లారీ అసోసియేషన్ ఓనర్స్ నూతన ఎన్నికను ఆదివారం లారీ అసోసియేషన్ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ ఎన్నికలో గౌరవ అధ్యక్షుడిగా గడ్డం సత్తిరెడ్డి, అధ్యక్షుడిగా పాటి దివాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అక్కనపల్లి గణేష్, కోశాధికారిగా భగవాన్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ అన్వర్, చిట్టి రెడ్డి భూపాల్ రెడ్డి, సహాయ కార్యదర్శిలుగా పోలగోని వెంకన్న, రావుల కర్ణాకర్, కార్యనిర్వహణ కార్యదర్శిగా జడల భూషయ్య, పాటు పలువురుని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షుడిగా ఎన్నికైన దివాకర్ రెడ్డి మాట్లాడుతూ లారీ అసోసియేషన్, ఓనర్స్, డ్రైవర్స్, సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్క సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

### నూతనంగా ఎన్నికైన సూర్యాపేట జిల్లా

## కబడ్డీ అసోసియేషన్‌కు గుర్తింపు పత్రం



**కోదాడ జులై 13 (సాక్ష్యం )** హైదరాబాద్ ఎల్బీ స్టేడియం లో ఆదివారం జరిగిన రాష్ట్ర ఎక్సక్యూటివ్ సమావేశంలో నూతనంగా ఎన్నికైన సూర్యాపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ కు గుర్తింపు పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్బంగా నూతన అధ్యక్ష,కార్యదర్శులు అల్లం ప్రభాకర్ రెడ్డి, నామా నరసింహా రావు మాట్లాడుతూ మాకు అన్ని విధాలుగా సాయసహకారాలు అందించిన రాష్ట్ర మంత్రివర్యులు కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ వారి సహకారంతో జిల్లా కబడ్డీ క్రీడాకారులని జాతీయ అంతర్జాతీయ స్థాయిలో తీర్చి దిద్దుతాం అని అన్నారు. అదే విదంగా మా పై నమ్మకం తో మాకు బాధ్యతలు ఆపగించిన రాష్ట్ర అధ్యక్షు, కార్యదర్శులు కాసాని వీరేష్ కి, మహేందర్ రెడ్డికి ప్రతేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఇందిరమ్మ కాలనీ వాసులకు ఇంటి పట్టాలు ఇవ్వాలి

సామాజిక కార్యకర్త బషీరుద్దీన్



**కోదాడ జులై 13 (సాక్ష్యం)** ఇందిరమ్మ కాలనీ వాసులకు ఇంటి పట్టాలు ఇవ్వాలని సామాజిక కార్యకర్త బషీరుద్దీన్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కోదాడ పట్టణ పరిధిలోని లక్ష్మీపురం ఇందిరమ్మ కాలనీవాసులకు 2007 జనవరి 6న భూమి పూజతో ప్రారంభమై 54 ఎకరాల విస్తీర్ణంలో అలనాటి కోదాడ మేజర్ గ్రామపంచాయతీ గా ఉన్న 20 వార్డుల్లోని లబ్ధిదారులందరికీ గ్రామసభల ద్వారా ఎంపిక చేసి స్థలాలు కేటాయించారు. 18 సంవత్సరాలు గడుస్తున్న నీటికి ఇంటి పట్టాలు ఇవ్వక మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో లేక కాలనీవాసులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి పట్టాలు ఇవ్వకపోతే ఆమరణ నిరాహారదీక్షకు సైతం సిద్ధమని బషీరుద్దీన్ తెలిపారు. ఎడవల్లి భాస్కరరావు మామిడి శంకర్ నాగేశ్వరరావు నన్నేసాహెబ్ సిద్దయ్య నరేష్ డాక్టర్ పాషా నరసింహ బడే మియా వెంకటరత్నం అబ్దుల్లా పెంటు కోపూరు అన్నపూర్ణ సరోజా దేవి మేరీ ఖాజావి అమీనా షాహిదా పాల్గొన్నారు.

## ఆడక్వాషిని తొలగించి పదోన్నతులు కల్పించాలి



**మిర్యాలగూడ డివిజన్ జూలై 13 (సాక్ష్యం న్యూస్)** బంజారా ఉద్యోగుల సంఘం ఉపాధ్యాయ పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీలకు అడ్డంకిగా మారిని అడక్వాషిని తొలగించి పదోన్నతులు కల్పించాలని బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణా రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరథ్ నాయక్,నాయకులు గజ్జెటెడ్ ప్రధానోపాధ్యాయులు గోపి నాయక్,కొండ లింగయ్య, భాష్య లు కోరారు. ఆదివారం మిర్యాలగూడలో జరిగిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతూ అడాక్వాషి అనేది పదోన్నతులు అడ్డుకోవడానికేనని చెప్పారు.ఖాళీగా ఏర్పడిన ప్రతి పోస్టులు జనరల్ కేటగిరీ కింద మారతాయని అటువంటి పోస్టులలో పదోన్నతులు ఇచ్చేటపుడు రోస్టర్ కమ్ మెరిట్ ప్రాతిపదికన పదోన్నతులు ఇవ్వాలని కోరారు.ఈమేరకు ఎస్సీ, ఎస్టీల ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందించినట్లు తెలిపారు. సోమవారం తుంగతుర్తి పర్యటనకు వస్తున్న సిఎం దృష్టికి ఎస్సీ, ఎస్టీ ఎంఎల్ఏ లు, ఎంఎల్సి లు తీసుకవెళ్ళని కోరారు. అవసరమైతే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ, ఉపాధ్యాయులు సిఎంను కలిసి విన్నవిస్తామని చెప్పారు. సిఎం ప్రత్యేక దృష్టికి సారించి అడక్వాషిని తొలగించి పదోన్నతులు కల్పించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. సీఎంకు ఎస్సీ, ఎస్టీలపై ప్రత్యేక ప్రేమ వున్నదని అడక్వాషి ఉత్తర్వులు రద్దు చేస్తారనే నమ్మకం ఉందని చెప్పారు.ఎంఎల్ఏ లు వేముల వీరేశం,మందుల సామెలు, ఎంఎల్సిలు అద్దంకి దయాకర్, కేతావత్ శంకర్ నాయక్ లు అడాక్వాషి రద్దు విషయమై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చూపాలని కోరారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల నాయకులు మక్లా నాయక్, సైదులు, వడ్డే రాజు, సైదయ్య, జమ్లా నాయక్,బద్దు నాయక్,శంకర్ నాయక్, నెహ్రూ నాయక్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై దాడిని ఖండిస్తున్నాం

– బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్



**మిర్యాలగూడ డివిజన్ జూలై 13 (సాక్ష్యం న్యూస్)** హైదరాబాదులో బీసీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పై దాడి చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని మిర్యాలగూడలో బీసీ యువజన సంఘం సమావేశంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ బిసి ఎమ్మెల్సీ అయినటువంటి తీన్మార్ మల్లన్న పై బీ,ఆర్,ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కవిత అనుచరులు క్యూ న్యూస్ కార్యాలయంపై మరియు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పై దాడి చేయడాని రాష్ట్ర బీసీ సమాజమంతా తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు అలాగే మల్లన్న గన్మెన్లపై విచక్షణ రహితంగా దాడి చేసిన తెలంగాణ జాగృతి గుండాలపై పోలీసు వారు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు బీసీ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పై దాడి చేసిన వారిని తక్షణమే గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే మాత్రం బీసీలు తిరగబడే అవకాశం కూడా ఉంటుంది తెలంగాణ రాష్ట్రంలో బీసీలు సహనం కోల్పోతే. కవిత బయట తిరిగే అవకాశం కూడా ఉండదని ఆయన హెచ్చరించారు కాబట్టి కార్యాలయంపై మరియు మల్లన్న వ్యక్తిగత సిబ్బంది పై దాడి చేసిన వారందరిపై కఠిన చర్యలు తీసుకోకపోతే మాత్రం బీసీ లందరూ పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో.. దాసరాజు జయరాజ్, యుద్ధం రాజు, నాయిని భాస్కర్, గంగాధర్, అంజి గౌడ్, ఉపేందర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు

### రాజకీయాలకు అతీతంగా

## పని చేసే జర్నలిజానికి సంపూర్ణ మద్దతు

– నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

– ఎమ్మెల్యేను కలిసిన టిడబ్ల్యూజేఎఫ్ నూతన కమిటీ



**వరంగల్ జులై13 (సాక్ష్యం న్యూస్ ) :** రాజకీయాలకు అతీతంగా సమాజం కోసం పాటుపడే జర్నలిస్టులకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు జక్కుల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నర్సంపేట శాసనసభ్యుడు దొంతి మాధవరెడ్డిని ఆదివారం హనుమకొండ లోని తన నివాసంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన కార్యవర్గ కమిటి మర్యాదపూర్వకంగా కలసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూజెఎఫ్ వరంగల్ జిల్లా కమిటీకి శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ తన నియోజకవర్గంలో జర్నలిస్టులకు తాను చేయగలిగిన సహాయ సహకారం అందజేస్తానని ఎల్లవేళలా జర్నలిస్టులకు అండగా ఉంటానని తెలిపారు. జర్నలిస్టులు రాజకీయాలకతీతంగా ప్రజా సమస్యలను వెలికి తీసి పరిష్కారం చేయడంలో ప్రధాన భూమిక పోషించాలని సూచించారు. రాజకీయాలకు తావులేని సమాజ చైతన్యం కోసం జర్నలిజం ఉపయోగపడాలని దారి తప్పుతున్న వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు జర్నలిజం ఉపయోగపడాలని అటువంటి సమాజ హిత జర్నలిజానికి ప్రభుత్వాలు ,ప్రతిపక్షాలు ఎప్పుడు జవాబుదారీగా పని చేస్తాయని అన్నారు. తను చేయగలిగిన సహకారం జర్నలిస్టులకు తప్పనిసరిగా అందజేస్తామన్నారు. ఎమ్మెల్యే దొంతిని కలిసిన వారిలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు జక్కుల విజయ్ కుమార్ , టిడబ్ల్యూజేఎఫ్ ప్రధాన కార్యదర్శి బొట్లస్వామిదాస్, ఉపాధ్యక్షుడు వెల్ది రాజేందర్, సంయుక్త కార్యదర్శి భావండ్ల పెల్లి కిరణ్ కుమార్, సురేష్ ,రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ పాలడుగుల సురేందర్, సీనియర్ జర్నలిస్ట్ సాదిక్ పాషా, సభ్యులు శ్రీనివాస్, వై రవికుమార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### సేఫ్టీ టాక్సీ, డ్రైవర్స్ కార్మికులకు

## ఎల్లవేళలా అండగా ఉంటా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**బోయిన్పల్లి జూలై 13 (సాక్ష్యం న్యూస్)** బోయిన్పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ సేఫ్టీ టాక్స్, డ్రైవర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర సమితి కార్మిక విభాగం నూతన కమిటీ సభ్యులు. నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించి అభినందించిన ఎమ్మెల్యే. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కార్మికులకు ఎలాంటి సమస్యలు వచ్చిన వారి పక్షాన ఉండి ఎల్లవేళలా పోరాడుతానని మీకు తోడుగా ఉంటానని తెలిపారు. అదేవిధంగా కార్మికులకు సోషల్ సెక్యూరిటీ ఇన్సూరెన్స్ కింద 5 లక్షల ఇన్సూరెన్స్ స్కీమును రెన్యువల్ చేయాలని, డ్రైవర్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరగా అందుకు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ఆత్తిన మోని నగేష్ కుమార్, వీరయ్య, షఫీహుద్దీన్, రాజు యాదవ్, కార్మిక సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల ఉద్యమ నేత పంది శ్రీనుకు డాక్టరేట్

**– డాక్టరేట్ మరింత బాధ్యతను పెంచింది:**





**సికింద్రాబాద్, సాక్ష్యం జులై 13.....**గత 20 సంవత్సరాలుగా దివ్యాంగుల కోసం, పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిత్యం అందుబాటులో ఉండి పలు రకాల సేవలు అందిస్తున్న... సికింద్రాబాద్ నియోజకవర్గంలోని తార్నాక డివిజన్ రవీంద్ర నగర్ కాలనీకి చెందిన పంది శ్రీను సేవలను గుర్తించి మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు రోజు ఢిల్లీలో పంది శ్రీను కు డాక్టరేట్ అవార్డును అందజేసింది. ఈ సందర్భంగా డాక్టర్ పంది శ్రీను మీడియాతో మాట్లాడుతూ.... డాక్టరేట్ రావడం ఎంతో ఆనందంగా ఉందని, నేను చేసిన సేవలను గుర్తించి నాకు డాక్టరేట్ అందివ్వడం చాలా సంతోషకరమని అన్నారు. రానున్న రోజుల్లో మరింత బాధ్యతగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని ఆయన తెలిపారు. డాక్టరేట్ రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. ముఖ్యంగా దివ్యా%శీ%గుల సమాజానికి, నన్ను ప్రోత్సహిస్తున్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నానని శ్రీనివాస్ అన్నారు.

## రైతులకు ఇబ్బంది లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా

– జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా ప్రతినిధి (సాక్ష్యం న్యూస్) 13 జులై** విద్యుత్ ఎంత వినియోగం ఉంది, దానికి తగ్గట్లు శాఖ పరంగా తీసుకుంటున్న చర్యల పై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది లేకుండా ప్రణాళిక బద్దంగా నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారువిద్యుత్ సరఫరాలో లోటుపాట్లు తలెత్తినా ఎడల యుద్ధ ప్రాతిపదికన సమస్యను పరిష్కరించడంతోపాటు మళ్లీ సమస్య పునరావృతం కాకుండా ప్రత్యేక బృందాల ద్వారా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎలాంటి ఓవర్ లోడ్ లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ విద్యుత్ అధికారులకు సూచించారు. జిల్లాలో ఎక్కడ విద్యుత్ అంతరాయం ఏర్పడినా వెంటనే 1912 కు టోల్ ఫ్రీ నెంబర్ కు విద్యుత్ వినియోగదారులు ఫోన్ చేసే విధంగా ప్రజలకు ఈ నెంబర్ తెలిసే విధంగా ప్రచారం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## వైద్య సిబ్బంది పనితీరు బెశ్: కలెక్టర్

**– అన్ని పని దినాల్లో అందుబాటులో వైద్య అధికారులు**

**– పాపన్నపేట మండలం పొడిచాన్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం**

**– పరిశీలించిన కలెక్టర్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**మెదక్ జిల్లా ప్రతినిధి ( సాక్ష్యం న్యూస్) 13 జులై** జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న వైద్యాధికారులు సిబ్బంది పనితీరు బేష్ అని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కొనియాడారు. ఆదివారం పాపన్నపేట మండలం పొడిచాన్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. పీహెచ్ సీలోని హాజరు పట్టికను తెప్పించుకుని పరిశీలించారు. ప్రతి రోజు ఇన్ పేషెంట్లు (Inpatients%) , అవుట్ పేషెంట్లు (Outpatients ) ఎంత మంది వస్తున్నారు. మందులు అందుబాటులో ఉన్నాయా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. నిరంతరం వైద్యసేవలు అందుతున్నాయని రోగులు చెప్పడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు



### గణపవరంలో ముగిసిన వరవర

## రంగనాయక స్వామి పవిత్రోత్సవాలు





**కోదాడ జులై 13 (సాక్ష్యం)** కోదాడ మండల పరిధిలోని గణపవరం గ్రామంలో గత 4 రోజులుగా జరుగుతున్న వరవర రంగనాయక స్వామి పవిత్రోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు నిర్వహించారు. చైర్మన్ ఇర్ల లక్ష్మారెడ్డి, ధర్మకర్తలు బి సైదులు, నాగలక్ష్మి, బిక్షం, సీతయ్య, కె నాగేశ్వరరావు, కె గురవయ్య, కృష్ణమాచార్యులు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు ఇర్ల సీతారాంరెడ్డి, పుష్పమ్మ, మంగమ్మ, దేవా, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## మిత్రుని కుటుంబానికి మిత్రబృందం చేయూత



**చిట్యాల జులై 13 (సాక్ష్యం)** చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డుకి చెందిన ఇస్మాయిల్ గత కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మరణించడం జరిగింది.ఇస్మాయిల్ తోటి మిత్రులంతా కలిసి అతని కుటుంబానికి, 66 వేల రూపాయలను మిత్రుని పిల్లల పేరు మీద పోస్ట్ ఆఫీస్ లో ఫిక్సిడ్ డిపాజిట్ చేసి ఆ డాక్యుమెంట్ లను చదువు చెప్పిన గురువుల చేతుల మీదుగా అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రధాన అతిధులుగా గురువులు చంద్రశేఖర్, దొడ్డి రామ్మూర్తి,మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

### గవర్నమెంట్ హై స్కూల్ పేద విద్యార్థులకు

## అల్పాహారం అందించిన సేవా పరమో ధర్మ సంస్థ



**బొల్లారం జులై 13 (సాక్ష్యం న్యూస్)** బొల్లారం పరిధిలోగల త్రిశూల్ పార్క్ సన్నిత అర్వంజ్ గవర్నమెంట్ హై స్కూల్ పేద విద్యార్థులకు బొల్లారంలోని సేవ పరమో ధర్మసంస్థ ఆధ్వర్యంలో ఉదయం విద్యార్థులకు అల్పాహారం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఆర్ టివి న్యూస్ స్టేట్ కోఆర్డినేటర్ మేడ మల్లేశం, సేవ పరమో ధర్మ సమస్త సభ్యులు సోనీ జాదవ్, రహమతుల్లా, నరసింహారావు, అరుణాచలం, రాజేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రావి ఆకుపై కోట శ్రీనివాస రావు చిత్ర పత్ర నివాళి



**నారాయణఖేడ్ జులై 13( సాక్ష్యం న్యూస్ )** వైవిధ్య భరితమైన పాత్రలతో సినీ ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్న ప్రముఖ నటులు కోట శ్రీనివాసరావు గారి మరణం చాలా బాధాకరం సుమారుగా నాలుగు దశాబ్దాల పాటు సినీ ,నాటక, రంగాలకు ఆయన చేసిన కళా సేవ ఆయన పోషించిన పాత్రలు చిరస్మరణీయం, విలన్ గా, క్యారెక్టర్ గా ,ఆర్టిస్ట్ గా ఆయన పోషించిన ఎన్నో మధురమైన పాత్రలు తెలుగు ప్రేక్షకుల మదిలో శాశ్వతంగా నిలిచిపోతాయి, ఆయన మృతి తెలుగు సినీ రంగానికి తీరని లోటు. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ రావియాకుపై వేసిన చిత్రంతో శ్రద్ధాంజలి ఘటిస్తూ చిత్రపత్ర నివాళి.

# రైతులపై కనికరం చూపని కరెంట్ అధికారులు!

## విద్యుత్ సరఫరా లేక పంటలు వేసుకోలేకపోతున్న రత్నాపూర్ రైతులు!



**సాక్ష్యం న్యూస్ ,శివంపేట.** దేశానికి అన్నం పెట్టె రైతన్ననే శివ్వంపేట మండల కరెంట్ అధికారులు ఎన్నో రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు.. కాయ, కష్టం చేసుకుని కుటుంబాలను పోషించు కుంటున్న అన్నదాతలను మండల విద్యుత్ అధికారులు ఆగమాగం చేస్తున్నారు. పంటలు సాగు చేసుకుందామంటే కరెంట్ అధికారులు కనికరం చూపించడం లేదని, విద్యుత్ ట్రాన్స్ పార్మర్ కు కనెక్షన్ ఇవ్వకుండా కరెంట్ అధికారులు తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ట్రాన్స్ పార్మర్ వద్ద రైతులు ఆందోళన చేపట్టిన సంఘటన మండలంలోని రత్నాపూర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం..గత ఐదు సంవత్సరాల క్రితం రత్నాపూర్ గ్రామానికి చెందిన బొగ్గుల విఠల్, బొగ్గుల గోపాల్, గోపాల మల్లయ్య తమ వ్యవసాయ పొలానికి బోరు మోటార్ల వినియోగం కోసం విద్యుత్ ట్రాన్స్ పార్మర్ గురించి డీడీలు కట్టారు.మూడు డీడీల ప్రకారం అధికారులు రత్నాపూర్ శివారు బాట మీద పొలంలో కరెంట్ ట్రాన్స్ పార్మర్ ను ఏర్పాటు చేసి కనెక్షన్ ఇచ్చి విద్యుత్ సరఫరాను అందజేశారు. కాని అక్కడ ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ పార్మర్ వల్ల పొలంలోకి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని భావించిన రైతులు ట్రాన్స్ పార్మర్ ను అక్కడి నుండి కొంత దూరానికి తరలించారు.ఇదే రైతులు చేసిన పెద్ద తప్పుగా విద్యుత్ అధికారులు భావించి గత యాసంగి పంట నుండి ట్రాన్స్ పార్మర్ కు కనెక్షన్ ఇవ్వకుండా నిలుపుదల చేశారని, ఇప్పుడు వానాకాలం పంటకు కనీసం వరి తుకం కూడ పోసుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కరెంట్ అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగిన కనికరించడం లేదని రైతులు వాపోయారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి, రత్నాపూర్ బంజ నాగయ్య పొలం దగ్గర, బాట మీద పొలంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ పార్మర్ కు విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

# రైతులకు ఎరువులు సకాలంలో అందేలా పటిష్ఠ చర్యలు కలెక్టర్

- రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- జిల్లా మొత్తంలో 4675.89 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు
- జిల్లాలో పుష్కలంగా యూరియా మరియు ఇతర ఫెర్టిలైజర్స్ కలెక్టర్
- ఎరువుల కొరత లేదు
- వ్యవసాయ సిబ్బందితో ప్రతిరోజు మానిటరింగ్
- పాపన్నపేట మండలం లక్ష్మీ నగరం గ్రామంలో పురుగు మందుల దుకాణాన్ని పరిశీలించిన కలెక్టర్
- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్




**మెదక్ జిల్లా ప్రతినిధి ( సాక్ష్యం న్యూస్) 13 జులై** రైతులకు ఎరువులు సకాలంలో అందేలా పటిష్ఠ చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఆదివారం జిల్లా కలెక్టర్ పాపన్నపేట మండలం లక్ష్మీనగరం గ్రామం ఎరువులు, మరియు పురుగు మందుల దుకాణాన్ని కలెక్టర్ పరిశీలించారు .యూరియా, కాంప్లెక్స్ ఎరువుల నిల్వ, అమ్మకాలు ఈ పాస్ యంత్రంలో నమోదు వివరాలు, దుకాణం, గోదాంలోని ఎరువులు, పురుగు మందుల నిల్వలను పరిశీలించారు. ప్రస్తుతం యూరియా, కాంప్లెక్స్ ఎరువులు, పొటాష్ అందుబాటులో ఉన్నట్లు, యూరియాకు ఎలాంటి ఇబ్బంది లేదని కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందనిజిల్లాలోని అన్ని గ్రామాలకు ప్రణాళిక బద్ధంగా, వివిధ పంట దశల ఆధారంగా రైతులకు సరిపడా యూరియా మరియు ఎరువులు ప్రభుత్వం నుండి అందజేయబడుతోందని అన్నారు. జిల్లా మొత్తంలో 4675.89 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయన్నారు.మండలంలోని వివిధ గ్రామాలను, ఎరువుల విక్రయ కేంద్రాలకు మ్యాపింగ్ చేయాలని, వ్యవసాయ సిబ్బందిని ఆదేశించినారు. ఎరువుల విక్రయ కేంద్రాల నిర్వాహకులు ప్రతిరోజు సమయపాలన పాటించి,వచ్చిన ఎరువులను క్రమ పద్ధతిలో రైతులకు అందించాలని తెలిపినారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ప్రశ్నించే గొంతుక మీద హత్యయత్నం చేయడం దుర్మార్గమైన చర్య

## – బహుజన రాజ్యాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ ముంజాల రాజేందర్ గౌడ్



**నర్సంపేట జులై 13(సాక్ష్యం న్యూస్ ) :** ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్న మీద హత్యయత్నం చేయడం దుర్మార్గమైన చర్య అని బహుజన రాజ్యాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ ,రాష్ట్ర బీసీజెఎసి , కో అర్డినేటర్ ముంజాల రాజేందర్ గౌడ్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తీన్మార్ మల్లన్నకు వ్యక్తులు టార్గెట్ కాదు, సమస్యలే టార్గెట్ ఆ సమస్యల గురించి ప్రస్తావించినప్పుడు పరోక్షంగా ఆ సమస్యకు కారకులు అయిన వాళ్ళు ఆటోమేటిగ్గా టార్గెట్ అవుతారు. మల్లన్న కంచం, మంచం అనే పదాలు వాడినాడు, తెలంగాణ బాషా లో కొన్ని కులాలకు ఉప కులాలు ఉంటాయి. వారు వారు వారిని ప్రతి సంవత్సరం వారి దగ్గర డబ్బులు తీసుకోవడం ఆనవాయితీ. వారికి కంచం పొత్తు అంటే (తినడం, అడగడం, కుల కథలు చెప్పడం పండగలు చేయడం,) మంచం పొత్తు అంటే (ఒకరికి ఇంటి పిల్లను మిన్స్ అమ్మాయిని వాళ్లకు ఇవ్వకపోవడం )అంటే ఇయ్యం అందుకోకపోవడం బీ ఎవరి తోనైనా మాట్లాడే టప్పుడు తెలంగాణ యాస, బాషా లో మంచం పొత్తు లేదు కానీ కంచం పొత్తు వున్నది అంటారు. కానీ అది ఉద్దేశ్య పూర్వకంగా అనలేదు. బుద్దినవాళ్ళు ఎవ్వరూ కూడా అలాంటి పదాలు మహిళాల మీద ఉద్దేశ్య పూర్వకంగా వాడరు, అది ఫ్లోలో వచ్చిందే తప్ప కావాలని అనింది కాదని అందరికీ తెలుసునన్నారు. ఇలా ప్రతిదానికీ దాడి చేసుకుంటూ పోతే చూసే ప్రజలు హర్షించరు, చిదిరించుకుంటారు. అంతకు ఏమైనా ఇబ్బందులు వుంటే చట్టం వుంది చట్ట ప్రకారం వెళ్ళాలి, కోర్టులకు సమాధానం చెప్పుకుంటారు. ఈరోజు నిజమైన అంగరక్షకులని చూశా నేను, వాళ్ళ డ్యూటీ వేల కట్టలేనిది, తమ ప్రాణాలను అడ్డు పెట్టీ మల్లనని కాపాడారు, శభాష్ అంగరక్షకులారా.. శభాష్! ఇంత పెద్ద బీసీ ఉద్యమంలో కూడా బీసీల మీద దాడులు చేయడానికి వెనుకాడడం లేదు. దీనిని ప్రతి బీసీ సంఘం ఖండించవలసిన అవసరం ఎంతైన ఉందన్నారు. దాడీ మల్లన్న మీద జరగొచ్చు కానీ రేపు మీ మీద కూడా దాడి జరుగుతుంది. అన్ని బీసీ సంఘాలు ఏకమై దీనిని ఖండించాల్సిన బాధ్యత ప్రతి బీసీ సంఘం పైన ఉందన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డితో కలిసి మహంకాళి అమ్మ వారిని

# దర్శించుకున్న డిప్యూటి మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి



**సికింద్రాబాద్, సాక్ష్యం జులై 13...** ఆషాఢ మాసం ఉజ్జయిని మహంకాళి బోనాల జాతరకు సీఎం. రేవంత్ రెడ్డి ఆదివారం హాజరై, ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వ తరఫున పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి ముఖ్యమంత్రిని ఆత్మీయంగా స్వాగత%శీ% పలికారు. అనంతరం మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ , ఇతర ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలతో కలిసి బంగారు బోనం, పట్టు వస్త్రాలను అమ్మవారికి సమర్పించారు.

## బోనాల ఉత్సవాల్లో

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన నేతి కార్ సురేష్ లాల్



**సికింద్రాబాద్, సాక్ష్యం జులై 13...** బోనాల ఉత్సవాల్లో భాగంగా నగరంలోని మినిస్టర్స్ క్వార్టర్స్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసానికి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డిని ఆర్టిఏ మెంబర్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నేతికార్ సురేష్ లాల్ మర్యాదపూర్వకంగా కలిశారు.

# జర్నలిస్టులు తమ ఆరోగ్యాలపై శ్రద్ధ పెట్టాలి

## – కాజీపేట ఏసీపీ పింగళి ప్రశాంత్ రెడ్డి – ప్రెస్ క్లబ్‌లో మెగా హెల్త్ క్యాంపు సక్సెస్



**హనుమకొండ జులై 13 (సాక్ష్యం న్యూస్) :** కాలంతో పోటీపడుతూ, నిత్యం ఉరుకులు, పరుగులతో వార్తలు సేకరించి సమాజానికి అందించే జర్నలిస్టులు తమ ఆరోగ్యాలపై కూడా శ్రద్ధపెట్టాలని కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డి అన్నారు. జర్నలిస్టులు, డాక్టర్లు, పోలీసులు సమాజానికి దిక్సూచి అని చెప్పారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆద్వర్యంలో వర్కింగ్ జర్నలిస్టుల కోసం ఆదివారం ప్రెస్ క్లబ్ లో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమానికి ఏసీపీ ప్రశాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైద్య శిబిరం ఏర్పాటు చేయటం, జర్నలిస్టులకు ఉచిత పరీక్షలు, వైద్యం అందించటం, మందులుసైతం ఉచితంగా ఇవ్వటం అభినందనీయమని అన్నారు. ఏకశిలా హాస్పిటల్స్ ఛైర్మన్ కుందూరు కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ వైద్యులు సేవాభావంతో పనిచేస్తారని, వారిని జర్నలిస్టులు పాజిటివ్ కోణంలో చూడాలని సూచించారు. జర్నలిస్టులకు తాను అన్నివిధాలా సహకరిస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా వైద్య శిబిరంలో సేవలందించిన డాక్టర్లు, వైద్య సిబ్బందిని సత్కరించిన గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ కార్యవర్గం, వివిధ యూనియన్ల బాధ్యులు సత్కరించారు. వైద్య పరీక్షల కోసం ఈసీజీ, టూడీ ఈకో మెషిన్లు ఏర్పాటు చేసి వైద్య సిబ్బందిని సమకూర్చిన ఏకశిలా హాస్పిటల్స్ ఛైర్మన్ కుందూరు కరుణాకర్ రెడ్డికి జర్నలిస్టులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో హన్మకొండ ఇన్స్ పెక్టర్ మచ్చ శివకుమార్, సుబేదారి ఇన్స్ పెక్టర్ రంజిత్ లతో పాట్లు డాక్టర్లు, వైద్యసిబ్బందికి శాలువాలతో సత్కరించి, ప్రెస్ క్లబ్ చిత్రంతో కూడిన మెమోంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, కోశాధికారి బొల్ల అమర్, ఉపాధ్యక్షులు గోకారపు శ్యాం,కొడిపెల్లి దుర్గాప్రసాద్ రావు, అల్లం రాజేష్ వర్మ, యంసాని శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీలు సంపెట సుధాకర్, పెద్దపెల్లి వరప్రసాద్,పొడిచెట్టి విష్ణువర్ధన్, వలిశెట్టి సుధాకర్, ఈసీ మెంబర్లు జనగాని ఆంజనేయులు, ఎండీ నయీం పాషా, కందుకూరి సంజీవ్,వివిధ సంఘాల నేతలు గాడిపెల్లి మధు,తోట సుధాకర్, కంకణాల సంతోష్, వల్లాల వెంకటరమణ, వర్ధెల్లి లింగయ్య, గడ్డం కేశవమూర్తి, దుంపల పవన్, అచ్యుత రఘునాధ్, చెరుకు వేణుప్రసాద్, నాగరాజు, మైదం సుధాకర్, కట్ట రాజు, రామకృష్ణాచారి, ప్రభాకర్, రామాచారి, టీవీ రాజు, కుమారస్వామి, కృష్ణకుమార్ రెడ్డి, కిరణ్, సాంబశివరావు, శోభన్, శర్మ, రమేశ్ బాబు, సుధాకర్, మున్నా, తిరుమల్, బుచ్చిరెడ్డి, సాల్మన్, సాయిరెడ్డి, శ్రీనివాస్, ఆర్వీ ప్రసాద్, రవి, రజాక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**మెగా హెల్త్ క్యాంప్ సక్సెస్**

గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని జర్నలిస్టులు సద్వినియోగం చేసుకున్నారు. ఉదయం 9:30 గంటలకు వైద్యులు, జర్నలిస్టులతో కలిసి వైద్యశిబిరాన్ని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు ప్రారంభించారు. ఉదయం ప్రారంభమైన హెల్త్ క్యాంపు మధ్యాహ్నం వరకు కిటికిటలాడింది. శనివారం రక్త పరీక్షలు చేసుకున్న జర్నలిస్టులతో పాటుగా సాదారణ చెకప్ లకోసం పలువురు జర్నలిస్టులు హాజరయ్యారు. రక్త పరీక్షల రిపోర్ట్ ల ఆధారంగా ఈసీజీ, టూడీ ఈకో పరీక్షలు నిర్వహించారు. వాటి ఆధారంగా కార్డియాలజిస్టులు డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ కూరపాటి మధు, డాక్టర్ వివేక్, డాక్టర్ లావణ్య, న్యూరో వైద్యులు డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ శ్రీచరణ్, ఫిజీషియన్లు డాక్టర్ వైద్యం గౌతం, డాక్టర్ మహేష్ లు పాల్గొని వైద్య సేవలందించారు. వైద్య శిబిరంలో పాల్గొన్న జర్నలిస్టులకు మందులు రాసి, తగు సూచనలు చేశారు. డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ ఆధారంగా జర్నలిస్టులకు ఉచితంగా మందులు అందజేశారు.

## ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న

# మాజీ మేయర్ బండ కార్తిక రెడ్డి దంపతులు



**సికింద్రాబాద్, సాక్ష్యం జులై 13...** శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల పండుగ సందర్భంగా మాజీ మేయర్ బండ కార్తిక చంద్రా రెడ్డి, రాష్ట్ర బీజేపీ నాయకులు, బండ చంద్ర రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బండ చంద్రారెడ్డి దంపతులతోపాటు సికింద్రాబాద్ కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా సెక్రెటరీ మల్లి కంటి వీరన్న, రజక సెల్ రాష్ట్ర నాయకులు కొన్నే సంపత్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

# గాంధీ బాటలో నడుద్దాం దేశానికి ఆదర్శంగా నిలుద్దాం

## – ఎమ్మెల్యే డా'' భూక్యా మురళి నాయక్





**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జులై 13 (సాక్ష్యం న్యూస్)** గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ స్వర్ణోత్సవాల సందర్భంగా గాంధీ భవన్‌లో నిర్వహించబడిన మహాత్మా గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు %–% స్వదేశీ మేళ కార్యక్రమంలో గాంధీ విగ్రహాలకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ శాసనసభ్యులు డా''భూక్యా మురళి నాయక్ ప్రభుత్వ ,ఎంపీ బలరాం నాయక్ ,మహబూబాబాద్ డిసిసిఅధ్యక్షులు జెన్నరెడ్డి భారత్ చందర్ రెడ్డి ,గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ కార్యక్రమంలో గాంధీయ విధానాలపై చర్చిస్తూ స్వదేశీ ఆవశ్యకత, గ్రామీణ ఆత్మనిర్భరతపై గొప్ప అవగాహన కల్పించడమే లక్ష్యంగా వివిధ ప్రతినిధులు తమ అభిప్రాయాలు వ్యక్తపరిచారు.ఈ సందర్భంగా గాంధీ భవన్ హల్ లో ఏర్పాటు చేసిన సమావేశమందిరం లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మహబూబాబాద్ ఎమ్మెల్యే డా'' భూక్యా మురళి నాయక్ డాక్టర్ మాట్లాడుతూ %–% "మహాత్మా గాంధీ చూపిన సన్మార్గంలో ఇప్పటికీ సమకాలీనతను కలిగి ఉంది.అంతేకాకుండా గాంధీజీ తన స్వయంగా తను నేచిన వస్త్రాలనే తను ధరించేవాడు అని గాంధీ గారి జ్ఞాపకాలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా తెలియజేశారు.అనంతరం ఎమ్మెల్యే కి శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు గాంధీయులు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు ,నాయకులు పాల్గొన్నారు.

# యుద్ధాలతో మానవ సమాజానికి తీవ్ర నష్టం

## – 'యుద్ధం ఎవరి కోసం' రాష్ట్ర సదస్సులో వక్తలు





**వరంగల్ జులై 13( సాక్ష్యం న్యూస్ ) :** అమెరికన్ సామ్రాజ్యవాదుల స్వప్రయోజనాల కోసమే కోసమే ప్రపంచ దేశాల మధ్య యుద్ధాలను ప్రేరేపిస్తున్నారని యుద్ధాలతో మానవ సమాజానికి తీవ్ర హానికరమని జస్టిస్ చంద్రకుమార్,ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ అధికార ప్రతినిధి జేవి చలపతిరావు, సిపిఐ ఎంఎల్ కేంద్ర కమిటీ సభ్యులు గుర్రం విజయ్ కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక (టీఎస్ డిఎఫ్) ఆధ్వర్యంలో యుద్ధాలు ఎవరికోసం అనే అంశంపై రాష్ట్ర సదస్సు టీఎస్ డీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ వినాయక రెడ్డి అధ్యక్షతన వరంగల్ పోచం మైదాన్ లోని అబ్బూస్ ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య వక్తలుగా విచ్చేసిన వారు మాట్లాడుతూ ప్రపంచ దేశాలపై పెత్తనం చెలాయించడానికి దోచుకోవడానికి అమెరికా శక్తి వంచన లేకుండా యుద్ధాలను ప్రోత్సహిస్తున్నదని ఈ క్రమంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు వెనుకబడిన దేశాలు తీవ్రంగా నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యుద్ధాలు మానవ సమాజంపై తీవ్ర ప్రభావం చూపించి పర్యావరణం దెబ్బతిని ఆర్థికంగానే కాకా వేలాదిమంది ప్రాణ నష్టాలతో భవిష్యత్తు లేకుండా చేస్తున్నాయని ఇప్పటికే గాజా ఇరాన్ పాలస్తీనా ఇతర కొన్ని దేశాలు యుద్ధాల వల్ల కోలుకోని విధంగా దెబ్బతిన్నాయని అభం శుభం తెలియని పసికూనలు మహిళలు సైతం ప్రాణాలు కోల్పోయారని, అమెరికా కనీస మానవత్వం లేకుండా విలువలు కోల్పోయి వ్యవహరిస్తున్నదని అలాంటి అమెరికాకు భారత పాలకులు వత్తాసు పలకడం సిగ్గుచేటని పాకిస్తాన్ తో సయోధ్య కుదుర్చామని గొప్పలు చెబుతున్న ట్రంప్ ఆచరణలో ఇతర దేశాల మధ్య చిచ్చు ఎందుకు ఆర్పటం లేదన్నారు. అమెరికా ట్రంప్ ఆడేవి అన్ని నాటకాలేనని అంతా తెలిసిన మోడీ ప్రభుత్వం మాత్రం మన స్వప్రయోజనాలను మాని అమెరికా ప్రయోజనాల కోసం కార్పొరేట్ వ్యక్తుల కోసం సాగిలపడడం ఆందోళన కలిగిస్తున్నదని ఇప్పటికైనా అలాంటి పద్ధతులను మానుకోవాలని హెచ్చరించారు. అలాగే యుద్ధాలకు వ్యతిరేకంగా ప్రపంచ శాంతి కోసం మానవ సమాజం మనుగడ కోసం దోపిడి లేని రాజ్యం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అందులో భాగంగా ప్రజలను చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంసిపిఐ (యు), సిపిఐ జిల్లా కార్యదర్శిలు పెద్దారపు రమేష్, మేకల రవి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కే విశ్వనాథ్, గ్రేటర్ కార్యదర్శి రాచర్ల బాలరాజు, ఉమ్మడి జిల్లా నాయకులు నున్న అప్పారావు, లిబరేషన్ జిల్లా కార్యదర్శి అక్కనపెల్లి యాదగిరి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్, ఆర్.ఎస్.పి కొడగాని శివాజీ, ఇనాం రాష్ట్ర నాయకులు మహమ్మద్ అబ్దుల్ నబీ జుబేర్ మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి వంగల రాగసుధ ప్రసంగించగా కార్మిక నాయకుడు మాలోత్ సాగర్ ప్రజా సంఘాల నాయకులు గోనె కుమారస్వామి నర్ర ప్రతాప్ భైరబోయిన నరసయ్య వల్లందాస్ కుమార్ ఓదెల రాజన్న యూపీఎన్ఎం రాష్ట్ర కార్యదర్శి కన్న%శీ% వెంకన్న జిల్లా కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి నాగెల్లి కొమరయ్య మంద రవి గడ్డం నాగార్జున మాస్ సావిత్రి చుంచు జగదీశ్వర్ కనకం సంధ్య కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## జాక్ క్రాలీకి వేలు చూపిస్తూ వార్నింగ్

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య మూడో టెస్ట్ జరుగుతున్న లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్ లో శనివారం గందరగోళం నెలకొంది. జస్ప్రీత్ బుమ్రా వేసిన మూడో రోజు సమయానికి కొద్దిసేపటి ముందు భారత జట్టు తొలి ఇన్నింగ్స్ ముగిసింది. టీమిండియా 387 పరుగులకు ఆలౌట్ అయింది. ఇంగ్లాండ్ కూడా మొదటి



ఇన్నింగ్స్ లో సరిగ్గా అవే పరుగులు చేసింది. ఆ తర్వాత ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టింది. ఆట ముగియడానికి కొద్ది సమయం మాత్రమే ఉంది. ఇంగ్లాండ్ బ్యాటర్లు భారత పేసర్ జస్ప్రీత్ బుమ్రా వేస్తున్న మొదటి ఓవరే ఆరోజు చివరి ఓవర్ కావాలని కోరుకుంది.అదే ప్లాన్ ను అమలు చేసి విమర్శలపాలవుతున్నారు. ఇంగ్లాండ్ ఓపెనర్ జాక్ క్రాలీ కావాలనే సమయాన్ని వృధా చేశాడు. బౌలర్ బుమ్రా బాల్ వేయడానికి వస్తున్న సమయంలో వికెట్లను వదిలి వెనక్కి వెళ్లాడు. మొదట అతడు ఓవర్ నెమ్మదిగా జరిగి, ఇదే లాస్ట్ ఓవర్ అవ్వాలని భావించాడు. మొదట బాల్ వేస్తుంటే వెనక్కి జరిగి రెడీగా లేనంటూ టైమ్ వేస్ట్ చేశాడు. బుమ్రా వేసిన ఐదవ బంతిని డిఫెన్స్ ఆడిన తర్వాత, తన చేతికి బాల్ తగిలినట్లు చూపించాడు. జాక్ క్రాలీ వెంటనే డ్రెస్సింగ్ రూమ్ వైపు సైగ చేశాడు. ఇదంతా గమనిస్తున్న టీమిండియా కెప్టెన్ శుభమన్ గిల్ కోపంతో ఊగిపోయాడు. భారత ఆటగాళ్లు చప్పట్లు కొట్టి జాక్ క్రాలీ నాటకాలు చాలంటూ ఎగతాళి చేశారు. ఆ తర్వాత గిల్ ఇంగ్లాండ్ ఓపెనర్ దగ్గరకు వెళ్లి వేలు చూపిస్తూ కోపంగా ఏదో చెప్పాడు.దీని తర్వాత మరో ఓవర్ వేయాలని టీమిండియా భావించింది. కానీ వికెట్ కోల్పోతామన్న భయంతో ఇంగ్లాండ్ అలా జరగకుండా ప్లాన్ చేసింది. దీనికి ముందు చివరి ఓవర్ మూడో బంతికి క్రాలీ ముందుకు వచ్చాడు. మహ్మద్ సిరాజ్, బుమ్రా కూడా బ్యాటర్లతో వాగ్వాదానికి దిగారు. ఇంటర్నేషనల్ మ్యాచులో ఇలాంటివి సరికాదని సూచించారు.

చివరి ఓవర్ లో ఇంగ్లాండ్ బ్యాటర్ చేసిన పనికి అంతా గుర్రుగా ఉన్నారు. జాక్ క్రాలీ ఇదే చివరి ఓవర్ కావాలని కోరుకున్నాడు, దాంతో అతడు ఉద్దేశపూర్వకంగా సమయాన్ని వృధా చేస్తున్నాడు. ఇది చూసిన శుభమన్ గిల్ కోపంతో ఊగిపోయాడు. ఇది సరైన పద్ధతి కాదంటూ క్రాలీ దగ్గరకు వెళ్లి వేలు చూపిస్తూ ఏదో చెప్పాడు.లార్డ్స్ టెస్టులో మూడోరోజు ఆట ముగిసే

# విజేతగా జానిక్ సినెర్

## ఫైనల్లో జానిక్ అల్కరాజ్ చిత్తు

## వింబుల్డన్ 2025 గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ



ప్రతిష్టాత్మక వింబుల్డన్ 2025 గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో వరల్డ్ నెంబర్ వన్, ఇటలీ స్టార్ జానిక్ సినెర్ విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో టాప్ సిడ్ జానిక్ సినెర్ 4-6, 6-4, 6-4, 6-4 తేడాతో వరల్డ్ నెంబర్ 2, కార్లోస్ అల్కరాజ్(స్పెయిన్)ను ఓడించాడు. ఈ గెలుపుతో 148 ఏళ్ల వింబుల్డన్ చరిత్రలో టైటిల్ గెలిచిన తొలి ఇటాలీయన్ ప్లేయర్‌గా 22 ఏళ్ల సినెర్ చరిత్రకెక్కాడు. అంతేకాకుండా గత నెలలో జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో అల్కరాజ్ చేతిలో ఎదురైన పరాజయానికి సినెర్ ప్రతీకారం తీర్చుకున్నాడు. ఈ ఓటమితో హ్యాట్రిక్ వింబుల్డన్ టైటిల్ గెలవాలనే అల్కరాజ్ కల చెదిరింది. మూడు గంటల 4 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో జానిక్ సినెర్ పూర్తి ఆధిపత్యం చెలాయించాడు. ఈ మ్యాచ్‌లో అల్కరాజ్ తొలి సెట్‌ను 6-4తో గెలిచి శుభారంభం చేసినా.. ఆ తర్వాత వరుసగా మూడు సెట్లను కోల్పోయాడు. తొలి సెట్ ఓడిన జానిక్ సినెర్ అద్భుతంగా పుంజుకొని వరుసగా మూడు సెట్లను 6-4తో కైవసం చేసుకొని కెరీర్‌లో లోటుగా ఉన్న వింబుల్డన్ టైటిల్ అందుకున్నాడు.ఈ మ్యాచ్‌లో అల్కరాజ్ 15 ఏస్‌లు సంధించి 7 డబుల్ పాల్ట్స్ చేశాడు. మరోవైపు జానిక్ సిన్నర్ 8 ఏస్‌లు సంధించి.. 2 డబుల్ ఫాల్ట్స్ మాత్రమే నమోదు చేశాడు. జానిక్ సిన్నర్ 4 బ్రేక్ పాయింట్స్ సాధించగా.. కార్లోస్ అల్కరాజ్ 2 మాత్రమే అందుకున్నాడు. సినర్ 125 పాయింట్స్ గెలిస్తే.. అల్కరాజ్ 113కు మాత్రమే పరిమితమయ్యారు. వింబుల్డన్ విజేతగా నిలిచిన సినర్‌కు రూ. 34 కోట్ల ప్రైజ్‌మనీ దక్కనుంది. ఇది గతేడాది కంటే 11శాతం ఎక్కువ. రన్నరప్ అల్కరాజ్ రూ. 17.65 కోట్ల ప్రైజ్‌మనీ అందుకోనున్నాడు. గతేడాది కంటే ఇది 8.6 శాతం ఎక్కువ.సినర్‌కు ఇది తొలి వింబుల్డన్ టైటిల్ కాగా.. నాలుగో గ్రాండ్ స్టామ్ టైటిల్. గతేడాది, ఈ ఏడాది ఆస్ట్రేలియా ఓపెన్ గెలిచిన సినెర్.. ఈ ఏడాది యూఎస్ ఓపెన్ సాధించాడు. వింబుల్డన్‌లో అల్కరాజ్ జైత్రయాత్రకు సినెర్ కళ్లెం వేసాడు. వరుసగా 24 విజయాల తర్వాత అల్కరాజ్ ఓటమిపాలయ్యాడు. గత రెండేళ్లలో సినెర్ నాలుగు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్‌షిప్‌లు, నాలుగు ఏటీపీ మాస్టర్స్ 1000 ట్రోఫీలు, 2024 నిట్టో ఏటీపీ ఫైనల్స్ టైటిల్‌ను గెలుచుకున్నాడు.




# 135 పరుగులు.. 6 వికెట్లు..

- రసవత్తరంగా మూడో టెస్ట్
- విజయానికి 135 పరుగుల దూరంలో భారత్
- గెలుపుకు 6 వికెట్ల దూరంలో ఇంగ్లండ్

భారత్, ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న మూడో టెస్ట్ రసవత్తరంగా మారింది. అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శనతో మ్యాచ్‌పై పట్టు బిగించిన టీమిండియా.. బ్యాటింగ్‌లో మాత్రం ఆశించిన ఆరంభాన్ని అందుకోలేకపోయింది. 193 పరుగుల సాధారణ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 17.4 ఓవర్లలో 4 వికెట్లకు 58 పరుగులు చేసింది. క్రీజులో కేఎల్ రాహుల్(33) ఉండగా.. యశస్వి జైస్వాల్(0), కరుణ్ నాయర్(14), శుభ్‌మన్ గిల్(6) మరోసారి తీవ్రంగా నిరాశపర్చారు. నైట్‌వాచ్‌మన్‌గా బరిలోకి దిగిన ఆకాశ్ దీప్(1) కూడా ఔటయ్యాడు.ఇంగ్లండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్ రెండు వికెట్లు తీయగా.. జోఫ్రా ఆర్చర్, బెన్ స్టోక్స్ చెరో వికెట్ తీసారు. భారత్ విజయానికి ఇంకా 135 పరుగులు చేయాల్సి ఉండగా.. ఇంగ్లండ్‌కు 6 వికెట్లు కావాలి. పిచ్ పూర్తిగా బ్యాటింగ్‌కు ప్రతికూలంగా మారింది. ఆఖరి రోజు ఆట తొలి సెషన్ మ్యాచ్ ఫలితాన్ని నిర్దేశించనుంది. కేఎల్ రాహుల్, రిషభ్ పంత్‌లపైనే టీమిండియా విజయవకాశాలు ఆధారపడి ఉన్నాయి.

అంతకుముందు 2/0 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 62.1 ఓవర్లలో 192 పరుగులకు ఆలౌటైంది. జోరూట్(96 బంతుల్లో ఫోర్‌తో 40), బెన్ స్టోక్స్(96 బంతుల్లో 3 ఫోర్లతో 33) టాప్ స్కోరర్లుగా నిలిచారు. భారత బౌలర్లలో సుందర్‌కు తోడుగా జస్‌ప్రీత్ బుమ్రా(2/38), మహమ్మద్ సిరాజ్(2/31) రెండేసి వికెట్లు తీయగా.. నితీష్ కుమార్ రెడ్డి, ఆకాశ్ దీప్ తలో వికెట్ పడగొట్టారు. దాంతో భారత్ ముందు 193 పరుగుల లక్ష్యం నమోదైంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 387 పరుగులకు ఆలౌటైంది.

అనంతరం భారత్ కూడా 387 పరుగులే చేసింది. వాషింగ్టన్ సుందర్(4/22) నాలుగు వికెట్లతో రఫ్ఫాడించడంతో 2/0 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 62.1 ఓవర్లలో 192 పరుగులకు ఆలౌటైంది. జోరూట్(96 బంతుల్లో ఫోర్‌తో 40), బెన్ స్టోక్స్(96 బంతుల్లో 3 ఫోర్లతో 33) టాప్ స్కోరర్లుగా నిలిచారు. భారత బౌలర్లలో సుందర్‌కు తోడుగా జస్‌ప్రీత్ బుమ్రా(2/38), మహమ్మద్ సిరాజ్(2/31) రెండేసి వికెట్లు తీయగా.. నితీష్ కుమార్ రెడ్డి, ఆకాశ్ దీప్ తలో వికెట్ పడగొట్టారు. దాంతో భారత్ ముందు 193 పరుగుల లక్ష్యం నమోదైంది. 2/0 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లండ్‌ను భారత బౌలర్లు దెబ్బతీసారు. మహమ్మద్ సిరాజ్, నితీష్ కుమార్ రెడ్డి, ఆకాశ్ దీప్ నిప్పులు చెరగడంతో ఇంగ్లండ్ తొలి సెషన్‌లోనే నాలుగు వికెట్లు కోల్పోయింది. బెన్ డకెట్(12), ఓలీ పోప్(4)లను సిరాజ్ పెవిలియన్ చేర్చితే జాక్ క్రాలీ(22)ని నితీష్ కుమార్ రెడ్డి ఔట్ చేశాడు. హ్యారీ బ్రూక్(23)ను ఆకాశ్ దీప్ క్లీన్ బౌల్డ్ చేశాడు. క్రీజులోకి వచ్చిన బెన్ స్టోక్స్, జో రూట్ ఆచితూచి ఆడి మరో వికెట్ పడకుండా తొలి సెషన్‌ను ముగించారు. దాంతో ఇంగ్లండ్ 98/4 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది.రెండో సెషన్‌లోనూ జోరూట్, బెన్ స్టోక్స్ సాధికారికంగా బ్యాటింగ్ చేశారు. పిచ్ కండిషన్స్ తగ్గట్లు




నిదానంగా ఆడారు. అసలు సిసలు టెస్ట్ బ్యాటింగ్‌తో భారత బౌలర్ల సహనానికి పరీక్షగా నిలిచారు. మరోవైపు భారత బౌలర్లు పదే పదే ఇంగ్లండ్ బ్యాటర్లను బీట్ చేశారు. ముఖ్యంగా సిరాజ్ బౌలింగ్‌లో స్టోక్స్, జోరూట్ తీవ్రంగా తడబడ్డారు.

స్టోక్స్ అయితే పదే పదే బంతులను తన శరీరానికి తాకించుకున్నాడు. రెండో సెషన్ ముగుస్తుందనగా.. వాషింగ్టన్ సుందర్ బ్రేక్ త్రూ అందించాడు. జిడ్డు బ్యాటింగ్‌తో హాఫ్ సెంచరీ దిశగా సాగిన జోరూట్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో ఐదో వికెట్‌కు నమోదైన 67 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ కాసేపటికే క్రీజులోకి వచ్చిన జెమీ స్మిత్(8)ను కూడా వాషింగ్టన్ సుందర్ క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో ఇంగ్లండ్ 175/6 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది. ఆఖరి సెషన్ ఆరంభంలోనే బెన్ స్టోక్స్(33) కూడా వాషింగ్టన్ సుందర్ క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆ మరుసటి ఓవర్‌లోనే బ్రైడన్ కార్స్(1)ను బుమ్రా తన మార్క్ యార్కర్‌తో క్లీన్ బౌల్డ్ చేశాడు. తన మరుసటి ఓవర్‌లో క్రిస్ వోక్స్(10) కూడా బుమ్రా బౌల్డ్ చేయగా.. షోయబ్ బషీర్(2)ను సుందర్ బౌల్డ్ చేసి ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. సుందర్ తీసిన నాలుగు వికెట్లు క్లీన్ బౌల్డ్ ద్వారానే లభించడం విశేషం. ఈ ఇన్నింగ్స్‌లో మొత్తం ఏడుగురు బ్యాటర్లు క్లీన్ బౌల్డ్ అయ్యారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 387 పరుగులకు ఆలౌటైంది. అనంతరం భారత్ కూడా 387 పరుగులే చేసింది.

**సంక్షిప్త స్కోర్లు:**

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 387 ఆలౌట్ (జోరూట్ 104, బుమ్రా 5/74)
భారత్ తొలి ఇన్నింగ్స్ 387 ఆలౌట్( కేఎల్ రాహుల్ 100, క్రిస్ వోక్స్ 3/84)
ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ 192 ఆలౌట్( జోరూట్ 40, వాషింగ్టన్ సుందర్ 4/22)
భారత్ రెండో ఇన్నింగ్స్ 58/4 ( కేఎల్ రాహుల్ 33లి, బ్రైడన్ కార్స్ 2/11లి)

# రవీంద్ర జడేజా అరుదైన రికార్డ్

లార్డ్స్ టెస్టులో టీమ్ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో 387 పరుగులకు ఆలౌటైంది. ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా (72 పరుగులు) హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. మూడో రోజు టీమ్ఇండియా బ్యాటింగ్‌లో కీలక పాత్ర పోషించాడు. అదిరే హాఫ్ సెంచరీతో జడ్డూ ఖఆకట్టుకున్నాడు. ఈ క్రమంలోనే జడేజా వరల్డ్ రికార్డ్ సాధించాడు. అరుదైన రికార్డుల్లో పేరు లిఖించుకున్నాడు. మూడో రోజు టీమ్ఇండియా త్వరత్వరగా రెండు వికెట్లు కోల్పోయిన దశలో జడ్డూ బ్యాటింగ్‌కు వచ్చాడు. పంత్, నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్ అలా ముగ్గురితో మంచి భాగస్వామ్యాలు నమోదు చేశాడు. ఇలా టీమ్ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో కీలక పాత్ర పోషించాడు. అయితే హాఫ్ సెంచరీ పూర్తయ్యాక, శతకం దిశగా సాగుతున్న జడేజాను 72 పరుగుల వద్ద క్రిస్ వోక్స్ ఔట్ చేశాడు. దీంతో జడ్డూ పెవిలియన్ చేరాడు. అయినప్పటికీ జడేజా అరుదైన లిస్ట్‌లో చేరాడు.వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ చరిత్రలో జడ్డూ అరుదైన ఘనత సాధించాడు. తాజా హాఫ్ సెంచరీతో జడేజా డబ్ల్యూటీసీ టోర్నీల్లో 2000 పరుగులు పూర్తి చేసుకున్నాడు. డబ్ల్యూటీసీలో జడేజాకు ఇది 15వ హాఫ్ సెంచరీ. అటు బౌలింగ్‌లోనూ 130 వికెట్లతో సత్తా చాటాడు. అలా ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో 2000o పరుగులు, 15 హాఫ్ సెంచరీలు, 130 వికెట్లు పడగొట్టిన ఏకైక ప్లేయర్‌గా జడేజా రికార్డు సృష్టించాడు. ఈ డబ్ల్యూటీసీలో ఇంతటి గణాంకాలు నమోదు చేసిన ప్లేయర్ ఒక్కడే! ఈ సిరీస్‌లో బౌలింగ్‌లో అంతంత మాత్రమే రాణిస్తున్న జడ్డూ, బ్యాటింగ్ లో ఆకట్టుకుంటున్నాడు. తొలి టెస్టులో ఫెయిల్ అయినా, రెండో మ్యాచ్‌లో అదరగొట్టాడు. ఎడ్జ్ బాస్టన్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో జడ్డూ రెండు ఇన్నింగ్స్‌ల్లో 50o స్కోర్లతో రాణించాడు. ఇక తాడాగా మూడో మ్యాచ్ తొలి ఇన్నింగ్స్ లోనూ 72 పరుగులతో ఆకట్టుకున్నాడు. ఇలా హ్యాట్రిక్ హాఫ్ సెంచరీలు నమోదు చేసి టీమ్ఇండియాకు కీలక ప్లేయర్‌గా నిలుస్తున్నాడు కాగా, ఈ సిరీస్‌లో జడేజా 5 ఇన్నింగ్స్‌ల్లో 88 సగటుతో 266 పరుగులు చేశాడు. ఇందులో 3 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. బౌలింగ్‌లో 3 వికెట్లు కూల్చాడు. ఇక టెస్టుల్లో ఓవరాల్‌గా 83 మ్యాచ్‌ల్లో 3636 పరుగులు చేశాడు. ఇందులో 25 హాఫ్ సెంచరీలు, 4 సెంచరీలు ఉన్నాయి. బౌలింగ్‌లో 326 వికెట్లు నేలకూల్చాడు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 387 పరుగులకు ఆలౌటైంది. స్టార్ బ్యాటర్ రూట్ (104 పరుగులు) సెంచరీ సాధించాడు. బ్రైడన్ కార్స్ (56) జెమీ స్మిత్ (51) హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్నారు. టీమ్ఇండియాలో



స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా అదరగొట్టాడు. ఐదు వికెట్లతో ఇంగ్లాండ్ పతనాన్ని శాసించాడు. నితీశ్ కుమార్ రెడ్డి, మహ్మద్ సిరాజ్ తలో 2, రవీంద్ర జడేజా 1 వికెట్ పడగొట్టారు. అయితే ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో ఇరు జట్ల స్కోర్లు సమం అయ్యాయి. 148 ఏళ్ల టెస్టు చరిత్రలో ఇలా తొలి ఇన్నింగ్స్‌లో రెండు జట్ల స్కోర్లు సమం అవ్వడం ఇది తొమ్మిదో సారి కావడం విశేషం. మూడో రోజు ఆఖర్లో ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ ప్రారంభించింది. మూడో రోజు ఆట ముగిసేసరికి ఇంగ్లాండ్ 2-0తో ఉంది. క్రీజులో క్రాలీ (2), డకెట్ (0) ఉన్నారు. ప్రస్తుతం ఇంగ్లాండ్ 2 పరుగుల లీడ్‌లో ఉంది.

## హ్యారీ బ్రూక్‌పై సంగక్కర విమర్శలు

ఇంగ్లండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్‌పై శ్రీలంక మాజీ క్రికెటర్ కుమార సంగక్కర విమర్శలు గుప్పించాడు. అహంకారపూరితమైన బ్యాటింగ్‌తో ఇంగ్లండ్‌కు తీవ్ర నష్టం చేశాడని ఘాటుగా వ్యాఖ్యానించాడు. ఐదు టెస్ట్‌ల అండర్సన్-సచిన్ ట్రోఫీలో భాగంగా లార్డ్స్ వేదికగా భారత్‌తో జరుగుతున్న మూడో టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో హ్యారీ బ్రూక్(23) క్లీన్ బౌల్డ్ అయ్యాడు. నాలుగో రోజు ఆట లంచ్ బ్రేక్‌కు 15 నిమిషాల ముందు అనవసర షాట్‌తో బ్రూక్ మూల్యం చెల్లించుకున్నాడు. దూకుడుగా బ్యాటింగ్ చేసిన బ్రూక్.. ఆకాశ్ దీప్ బౌలింగ్‌లో స్వీప్ షాట్ ఆడబోయి క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఆ సమయంలో కామెంట్రీ బాక్స్‌లో ఉన్న కుమార సంగక్కర.. ఇంగ్లండ్ బ్యాటర్‌పై విమర్శలు గుప్పించాడు. ఇది అనవసరమైన షాట్ అని అభిప్రాయపడ్డాడు. అసలు ఆ సమయంలో కౌంటర్ అటాకింగ్ చేయాల్సిన అవసరమే లేదన్నాడు. స్పిన్ బౌలింగ్‌లో ఆడాల్సిన స్వీప్ షాట్‌ను పేస్ బౌలింగ్‌లో ఆడి మూల్యం చెల్లించుకున్నాడని, ఇది బజ్ బాల్ గేమ్ కాదని, అతని అహంకారానికి నిదర్శనమని ఘాటుగా వ్యాఖ్యానించాడు.'భారత్ ఫైన్ లెగ్ ఫీల్డర్‌ను మార్చిందనుకుంటా. హ్యారీ బ్రూక్ స్వ్కేర్‌గా ఆడాలనుకున్నాడేమో.. కానీ అతని షాట్ నన్ను ఆశ్చర్యానికి గురి చేసింది. బ్రూక్ ఆడిన షాట్ ఏ మాత్రం స్కూప్ కాదు. స్కూప్ షాట్‌ను అతను సునాయసంగా ఆడుతాడు. ఇది స్వీప్ షాట్. సాధారణంగా స్వీప్ షాట్‌ను స్పిన్నర్‌పై ఆడుతారు. ఈ షాట్‌కు చాలా సమయం దొరుకుతుంది. లంచ్‌కు 15 నిమిషాలు ముందు కౌంటర్ అటాక్‌కు దిగారు. ఇది తెలివి తక్కువ నిర్ణయం. బ్రూక్ స్కూప్ షాట్ ఆడే ప్రయత్నం చేశాడు. కానీ బౌలర్ తెలివిగా గ్యాప్ ఇచ్చాడు. అప్పుడు బ్రూక్ ఫ్లిక్ షాట్ ఆడాల్సింది. కానీ అహంకారంతో స్వీప్ షాట్ ఆడి మూల్యం చెల్లించుకున్నాడు. ఇది బాజ్ బాల్ కాదు. అతి విశ్వాసం కూడా కాదు. కేవలం అహంకారం మాత్రమే. కౌంటర్ అటాక్ చేయడమే పెద్ద పొరపాటు.'అని సంగక్కర విమర్శలు గుప్పించాడు.

# అవతార్ లాంటి టెక్నాలజీ ప్రవేశ పెడతా : శంకర్



ప్రస్తుతం తన మార్క్ సినిమా కోసం ఎదురుచూస్తున్నారు డైరెక్టర్ శంకర్. ఇటీవల ఆయన తెరకెక్కించిన రెండు సినిమాలు ఆశించిన స్థాయిలో ప్రేక్షకుల అంచనాలను అందుకోలేకపోయాయి. ఇందులో గేమ్ ఛేంజర్ లాంటి సినిమాలు ఉండడంతో విమర్శలు ఎదుర్కొన్నారు. ఇప్పుడాయన తన తదుపరి ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. దాని వివరాలు పంచుకున్నారు. అది భారతదేశం గర్వించే సినిమా అవుతుందన్నారు. తాజాగా జరిగిన ఓ కార్యక్రమానికి అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. లక్ష కాపీలు అమ్ముడైన 'వేల్పారి' అనే నవల గురించి మాట్లాడారు. దీని ఆధారంగా ఆయన తన కలల ప్రాజెక్ట్‌ను తెరకెక్కించనున్నట్లు– తెలిపారు. ఒకప్పుడు నా డ్రీమ్ ప్రాజెక్ట్ 'రోబో'. ఇప్పుడు 'వేల్పారి'. భారీ బడ్జెట్‌తో ఇది రానుంది. ఇప్పటివరకూ చేసిన అతిపెద్ద చిత్రాల్లో ఇది ఒకటి అవుతుంది. దీనికి భారీ స్థాయిలో కాస్ట్యూమ్స్, ఆర్ట్ డిజైన్స్, టెక్నాలజీ అవసరం ఉంది. 'గేమ్ ఆఫ్ థ్రోన్స్', 'అవతార్' వంటి చిత్రాలకు ఉపయోగించిన సాంకేతికను పరిచయం చేయనున్నాను. ప్రపంచమంతా దీన్ని గుర్తిస్తుంది. త్వరలోనే నా కల నిజం కావాలని కోరుకుంటున్నాను' అని శంకర్ తెలిపారు. భారీ అంచనాల నడుమ శంకర్– కమల్‌హాసన్ కాంబోలో తెరకెక్కిన 'ఇండియన్ 2' నిరాశను మిగిల్చింది. దాని తర్వాత రామ్‌చరణ్ హీరోగా 'గేమ్ ఛేంజర్'ను రూపొందించారు. ఈ ఏడాది సంక్రాంతికి వచ్చిన ఈ సినిమా కూడా ఆశించిన స్థాయిలో విజయాన్ని సొంతం చేసుకోలేదు. దీంతో ఆయన తన తదుపరి ప్రాజెక్ట్ కోసం అన్ని జాగ్రత్తలు తీసుకుంటు–న్నారు. దీనికోసం కన్నడ హీరో యశ్‌తో కూడా సంప్రదింపులు జరిపినట్లు– వార్తలు వస్తున్నాయి. బాలీవుడ్ నిర్మాతలు కూడా ఇందులో భాగం కానున్నట్లు– టాక్ వినిపిస్తోంది.




## తెలుగులో వడుదలవుతున్న మై బేబీ

తమిళ్‌లో ఇటీవల విడుదలై సూపర్ హిట్ అయిన 'డీఎన్ఏ' మూవీ ఎలాంటి హిట్ అందుకుందో తెలిసిందే. నెల్సన్ వెంకటేసన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీ ఇటీవలే విడుదలై విమర్శకుల ప్రశంసలు అందుకుంది. హాస్పిటల్స్‌లో పిల్లల్ని మాయం చెయ్యడం, వారిని వేరే చోట అమ్మేయడం వంటి వార్తలు చూస్తుంటాం. ఇలాంటి వార్తలు ఇప్పుడు కాదు కొన్ని సంవత్సరాలుగా వింటూనే ఉన్నాం. ఈ సినిమా మరొక్కసారి గా మనం సొసైటీలో ఎంత జాగ్రత్తగా ఉండాలో తెలియచేసింది. అధర్వ మురళి, నిమిషా సజయన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ క్రైమ్ థ్రిల్లర్, భావోద్వేగ డ్రామాతో కూడిన గ్రిప్పింగ్ కథాంశంతో ఆకట్టు–కుంది. అయితే తమిళంలో విజయం సాధించిన మూవీ ఇప్పుడు తెలుగులో మై బేబీ పేరుతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రేమిస్తే, జర్నీ, షాపింగ్‌మాల్, పిజ్జా వంటి అనువాద హిట్స్‌ని తెలుగు ప్రేక్షకులకు అందించిన నిర్మాత సురేశ్ కొండేటి, ఇప్పుడు 'మై బేబీ' సినిమాను ఎస్.కె. పిక్చర్స్ బ్యానర్‌పై రిలీజ్ చేస్తున్నారు. రీసెంట్ గా తెలుగు సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా జూలై 18, థియేటర్లలో విడుదల కానుంది. ఇక భావోద్వేగాలతో పాటు– థ్రిల్ కలగలిపిన స్క్రీన్‌ప్లే ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుందని మేకర్స్ చెబుతున్నారు.




## యానిమల్ లాంటి హీరోతో డేటింగ్..!



వరుస సినిమాలతో అలరిస్తున్నారు నేషనల్ క్రష్ రష్మిక కెరీర్‌కు, 'యానిమల్' మూవీ ఎంతో విజయాన్ని అందించింది. అదే స్థాయిలో విమర్శలు కూడా వచ్చాయి. తాజాగా రష్మికను.. ఓ ఇంటర్వ్యూలో నిజ జీవితంలో యానిమల్ హీరో పాత్ర స్వభావం ఉన్న వ్యక్తితో మీరు డేటింగ్ చేస్తారా? అతడిలో మార్పు తీసుకురాగలరా? అని ప్రశ్న ఎదురవ్వగా .. ఆసక్తికర సమాధానమిచ్చింది రష్మిక. అలాంటి వ్యక్తితో డేటింగ్ చేయడానికి అభ్యంతరం లేదన్నారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి. ఇదే ఇంటర్వ్యూలో ఆమె ప్రేమపై తన అభిప్రాయాన్ని కూడా పంచుకున్నారు. మనం ఎవరినైనా ప్రేమిస్తే.. మనల్ని ఎవరైనా ప్రేమిస్తే మార్పు కచ్చితంగా జరుగుతుందని నేను నమ్ముతాను. ఎందుకంటే భాగస్వామితో కలిసి ఉంటున్నప్పుడు వారితో కలిసి జీవితాన్ని పంచుకుంటున్నప్పుడు ఇద్దరి వ్యక్తిత్వాల్లో మార్పు వస్తుంది. ఒకరికి ఒకరు అభిప్రాయాలు పంచుకుంటారు. ఇష్టాయిష్టాలు తెలుసుకుంటారు. ఒకరి కోసం ఒకరు మారతారు. మీ ప్రాణ స్నేహితుడితో కాని, మీ భాగస్వామితోనే కాని కొంతకాలం కలిసి ప్రయాణించాక అకస్మాత్తుగా పాత రోజులను గుర్తుచేసుకుంటే వారి కోసం మీరు ఎంతలా మారారో అర్థమవుతుంది. ఆ మార్పునకు ఒక్కోసారి మీరే ఆశ్చర్యపోతారని చెప్పారు. తాను అర్థంచేసుకునే భాగస్వామి గురించి మాత్రమే మాట్లాడినట్లు తెలిపారు.ప్రస్తుతం రష్మిక వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆయుష్మాన్ ఖురానాతో కలిసి 'థామా' అనే హారర్ కామెడీలో నటిస్తున్నారు. దీనితో పాటు- 'ది గర్ల్ ఫ్రెండ్'తో సిద్ధమవుతున్నారు. తాజాగా 'మైసా' అనే చిత్రాన్ని కూడా ప్రకటించారు అలాగే అట్లీ- అల్లు అర్జున్ సినిమాలోనూ ఈ అమ్మడు కనిపించనున్నట్లు- వార్తలు వస్తున్నాయి.

## పుష్పలో రష్మిక లాంటి రోల్స్ చేయాలని ఉంది

### కన్నడ నటి సప్తమి గౌడ

కన్నడ నుంచి టాలీవుడ్‌కి అందాల భామలు వరుసగా ఎంట్రీ ఇస్తూనే ఉన్నారు. సౌందర్య తర్వాత ఆ ట్రెండ్ తగ్గలేదు. నటనతో, గ్లామర్‌తో ఆకట్టుకుంటూ ఇక్కడ తమ సత్తా చాటుతున్నారు. అనుష్క,పూజాహెగ్డే రష్మిక మందన్న లాంటివారు ముందంజలో ఉండగా, పలు కొత్త హీరోయిలు కూడా టాలీవుడ్‌కి అడుగుపెడుతున్నారు. ఇటీవలి కాలంలో కన్నడ ఇండస్ట్రీ నుంచి పాన్ ఇండియా సినిమాలు వస్తుండటంతో, ఆ చిత్రాల్లో నటించిన హీరోయిన్లకు మిగతా భాషల నుంచి అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో భాగంగా 'కాంతార' ద్వారా సప్తమి గౌడ తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకుంది.అయితే 'కాంతార' లాంటి హిట్ అందుకున్న తర్వాత ఏ హీరోయిన్ అయినా వరుస సినిమాలతో ధూసుకుపోతారు కానీ.. సప్తమి మాత్రం 'కాంతార' తర్వాత ఎక్కువ సినిమాల్లో కనిపించలేదు. అయితే దీనికి స్పష్టమైన కారణం ఉన్నట్లు చెప్పుకొచ్చింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ' 'కాంతార' తర్వాత అదే తరహా పాత్రలు నా ముందుకు వచ్చాయి. రొటీన్‌గా అవే పాత్రలు చేయడం ఇష్టం లేక మంచి పాత్రల కోసం వెయిట్ చేశాను. ముక్కు పుడకలు పెట్టుకోవడం.. గ్రామీణ యువతిగా కనిపించడం.. డైలాగ్స్ లేకపోవడం, సినిమాలో క్యారెక్టర్ సరిగా లేకపోవడం వల్ల నేను సినిమాలు ఒప్పుకోలేదు. మంచి పాత్రల కోసం వెయిట్ చేయడం వల్ల ఎక్కువ సినిమాల్లో నటించలేకపోయాను. మిగతా హీరోయిన్లతో నాకు స్క్రీన్ స్పేస్ లేదు.. ప్రజంట్ తెలుగులో మరో రెండు సినిమాల్లో నటిస్తున్నాను. మరిన్ని అవకాశాలు వస్తాయని నమ్ముతున్న. పుష్ప మూవీలో రష్మిక మందన్నకు దక్కిన లాంటి రోల్స్ వస్తే బాగుంటుందని వెయిట్ చేస్తున్నా' అని చెప్పారు.

## ఎఐ ఆధారంగా భగవద్గీత

### ఐదునిముషాల నిడివిలో పూర్తి

ప్రస్తుతం భారత సినిమా ఇండస్ట్రీ పురాణాలు, ఇతిహాసాల ఆధారిత సినిమాలపై మక్కువ చూపుతున్నారు. వందల ఏళ్ల నాటి గ్రంథాల కథలు, శ్లోకాల గాథలు నేటి టెక్నాలజీతో ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే 'అదిపురుష్', 'శాకుంతలం', 'హనుమాన్' లాంటి సినిమాలు రాగా.. తాజాగా బాలీవుడ్ నుండి 'రామాయణ' కూడా రెండు బాగాలుగా రాబోతుంది. ఇప్పటికే హోంబలే ఫిల్మ్స్ పురాణాల ఆధారంగా ఏడు సినిమాలు నిర్మించనున్నట్లు– అధికారికంగా ప్రకటించగా, ఈ నేపథ్యంలో




దర్శకుడు రామ్ మాధ్వాని తాజాగా మరో సర్ప్రైజ్‌ను పంచుకున్నారు. ఏఐని ఉపయోగించి భగవద్గీతపై షార్ట్ ఫిల్మ్ రూపొందించినట్లు– చెప్పారు. రెండేళ్లు కష్టపడి దీన్ని అభివృద్ధి చేసినట్లు రామ్ మాధ్వానీ తెలిపారు. ఈ షార్ట్ ఫిల్మ్ కేవలం ఐదు నిమిషాల నిడివి ఉన్నప్పటికీ, అందులో గీతలోని 18 అధ్యాయాల సారాంశం చేయించినట్లు తెలిపారు. ఇప్పటికే ప్రైవేట్ ప్రివ్యూలలో ఈ చిత్రాన్ని ప్రదర్శించాగా.. 'వర్చువల్ రియాలిటీ ద్వారా మనం కథలోని పవిత్రతను పునరుద్ధరించవచ్చు. శతాబ్దాలుగా అందుబాటులో ఉన్న ఇతిహాసాల కంటే గొప్ప కథలు మరేం ఉండవు' అని రామ్ మాధ్వానీ చెప్పారు. తన లక్ష్యం కేవలం పౌరాణిక కథను చూపడం మాత్రమే కాదని, ప్రేక్షకులను ఆధ్యాత్మిక అనుభూతికి దగ్గర చేయడం అని స్పష్టం చేశారు. ఇలాంటి ప్రయత్నాలు కేవలం కథగా మాత్రమే కాదు, మన సంస్కృతి, తత్వాన్ని ఆధునిక ప్రపంచానికి పరిచయం చేస్తున్నాయి.



## లెనిన్ మూవీ నుంచి శ్రీలీల ఔట్

అక్కినేని అఖిల్ నటిస్తున్న చిత్రం 'లెనిన్'. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్న సినిమాను , అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్-టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై ఈ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్ర షూటింగ్ కూడా జరుగుతోంది. పలు పోస్టర్లను కూడా విడుదల చేసిన సంగతి అందరికీ తెలిసిందే. అయితే ఈ చిత్రంలో తొలుత టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ శ్రీ లీలా ఎంపికైంది. తర్వాత ఏమైందో ఏమో కానీ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పకుంది. శ్రీలీలను లెనిన్ చిత్రం నుంచి తప్పించిన తర్వాత మేకర్స్ షూటింగ్ పనులను మరింతగా వేగవంతం చేశారు. అయితే శ్రీలీలాతో ఇప్పటికే తీసిన ఓ 2 వారాల సీన్లను ఇప్పుడు భాగ్యశ్రీ తో రీషూట్ చేయబోతున్నారని తెలుస్తోంది. శ్రీ లీలా తో తీసిన సీన్స్ అన్నింటిని మళ్లీ చిత్రీకరించ బోతున్నారు. దీంతో టీమ్‌కు మరింత పని భారం పడనుందని అంటున్నారు. కాగా భాగ్యశ్రీ జూలై 16 నుండి షూటింగ్ సెట్స్‌లో జాయిన్ అవుతున్నట్టు-.. సమాచారం. ఇక ఈ చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్‌గా థమన్ పనిచేస్తుండగా. మాస్ అప్పీల్, స్టైలిష్ కథనంతో అఖిల్ ఈసారి కచ్చితంగా హిట్ కొడతాడా? అన్నది ఆసక్తికరమైన అంశంగా మారింది.




## పెద్ది నుంచి గౌర్నాయుడు లుక్ విడుదల

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'పెద్ది'. బుచ్చిబాబు సనా దర్శకత్వంలో, గ్రామీణ క్రీడల నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని.. వెంకట సతీష్ కిలారు నిర్మించగా, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా సమర్పిస్తున్నాయి. కాగా ఈ మూవీలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, జగపతి బాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రలో కనిపించనున్నారు. విజువల్ పరంగా సినిమాకి ప్రత్యేకంగా నిలిచేలా ఆర్. రత్నవేలు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, సంగీతానికి ఎ.ఆర్. రెహమాన్ అందిస్తున్నారు. ఇక రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా 2026 మార్చి 27న ఈ చిత్రాన్ని విడుదల చేయాలని చిత్ర బృందం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్, ఫస్ట్ లుక్స్‌తో సినిమాపై అంచనాలు కూడా భాగా పెరిగిపోయ్యాయి. అయితే తాజాగా చిత్రబృందం నేడు సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా, ఈ మూవీలో ఆయన పాత్రకు సంబంధించిన పవర్‌ఫుల్ ఫస్ట్ లుక్‌ను 'పెద్ది' చిత్ర బృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా విడుదలైన శివరాజ్ కుమార్ ఫస్ట్ లుక్ సినిమాలోని అతని పాత్ర ఎంత బలమైనదో చూపించింది. మందపాటి హ్యాండిల్ బార్ మీసం, గంభీరమైన చూపుతో.. శివరాజ్ కుమార్ లుక్ అదిరిపోయింది. కాగా ఈ మూవీలో ఆయన 'గౌర్నాయుడు' పాత్రలో కనిపించనున్నారు.

## ఒళ్లు గగుర్పొడిచే జాంబీ థ్రిల్లర్..

ఎప్పటిలాగే గత శుక్రవారం కూడా ఎన్నో కొత్త సినిమాలు, ఆసక్తికర వెబ్ సిరీస్ లు ఓటీటీలోకి వచ్చాయి. తెలుగులో పాటు వివిధ భాషలకు చెందిన సినిమాలు, సిరీస్ లు స్ట్రీమింగ్ అవుతున్నాయి. అయితే ఇందులో ఒక సినిమా మాత్రం ఆడియెన్స్ ను విపరీతంగా ఆకట్టుకుంటోది. గత శక్రవారం ఓటీటీలోకి వచ్చిన ఈ మూవీ గత మూడు రోజులుగా టాప్ ట్రెండింగ్ లో దూసుకెళ్లిపోతోంది. ఇదొక జాంబీ హారర్ థ్రిల్లర్ సినిమా పేరే జియామ్. థాయ్ ల్యాండ్ నేపథ్యంగా సాగే ఈ సినిమాలో అదిరిపోయే యాక్షన్ సీన్స్, రక్తపాతం, హారిబుల్ సీన్స్ చాలానే ఉన్నాయి. అందుకే ఈ సినిమాకు ఆడియెన్స్ నుంచి సూపర్బ్ రెస్పాన్స్ వస్తోంది. సినిమా కథ విషయానికి వస్తే.. ఆహార కొరత దేశాన్ని అతలా కుతలం చేస్తుంది. పర్యావరణ విపత్తులు ప్రజలను అస్తవ్యస్తం చేస్తాయి. అక్కడ సింగ్ అనే మాజీ ఫైటర్ డెలివరీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తుంటాడు. అతని ప్రియురాలు రిన్ ప్రచమిత్ ఆస్పత్రిలో డాక్టర్‌గా పని చేస్తుంది. అయితే ధృవాల్లో కరిగిన మంచు నుంచి విడుదలైన ఒక ప్రమాదకరమైన వైరస్ అంతటా వ్యాపిస్తుంది. అది మనుషులను కిరాతకమైన జాంబీలుగా మారుస్తుంది.



Editor, Printed, Published and Owned by Sudheer Kumar, Printed at Ratna Graphics , # 2-3-703/7, Thirumala Nagar Colony, Opposite : Police Line , Amberpet, Hyderabad-500013, Published At H.NO. 6-3-553/G2, ClassicCourt Anexa, opp: NKM Grand, Erramanzil Colony, Somajiguda, Hyderabad-500038, T.S. E-Mail: info.southindiatimes@gmail.com. ,Contact :9000657700. RNI NO. APTEL/2012/46756